

RNI NO.TGTEL/25/A5224

జోర్దార్

JORDAR TELUGU DAILY ది తెలుగు దినపత్రిక

అవినీతి అంతం - మా పంతం




కరీంనగర్ | సంపుటి : 01 | సంచిక : 296 | శనివారం, నవంబర్ 14 2026 , | పేజీలు - 8 | వెల : 2/- | epaper.jordar.com

జోర్ధార్ పై విషం కక్కుతున్న పెద్దసారు

■ అవినీతి బయట పెట్టినందుకే విద్వేషం

■ కరీంనగర్ జిల్లాలో ఓ ప్రబుద్ధుడి అహంకారం




కరీంనగర్ :

ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి పత్రికలు పనిచేస్తాయి. ప్రజల పక్షాన పోరాటం చేస్తాయి. ఎక్కడ అవినీతి జరిగితే అక్కడ బలహీనుల పాలిట అస్త్రమై నిలబడి న్యాయం కోసం పోరాటం సాగిస్తుంది. రేపటి తరాలను రూపుదిద్దే గౌరవప్రదమైన ఉపాధ్యాయుల పట్ల భక్తి గౌరవం ప్రదర్శిస్తూ మంచి ఆచరణలు వెలుగులోకి తేవడం జోర్ధార్ బాధ్యతగా సాగిస్తుంది. అదే సమయంలో అవినీతి అక్రమాలు దందాలు అహంకారం ప్రదర్శించే వారి పట్ల కాస్త గట్టిగానే జోర్ధార్ అక్షర పోరాటం సాగిస్తూనే ఉంటుంది. తాటాకు చప్పుళ్లకు భయపడడం, బ్లాక్మెయిల్ దందాలు చేయడం జోర్ధార్ చరిత్రలో లేదు. కరీంనగర్ జిల్లాలోని ఒక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇష్టారాజ్యంగా వ్యాఖ్యానించడం, జోర్ధార్ కథనాలను వాట్సప్ గ్రూప్ లలో పెడితే కాల్స్ చేసి బెదిరించడం, ఒక గ్రూప్ ను మూయించడం ఆయన పిచ్చి పరాకాష్టకు చేరిందని తెలుపుతున్నది. ఇది పత్రిక కాదని అనడం ఆయనకు డిజిటల్ మాధ్యమం పైన ఉన్న అవగాహనకు అద్దంగా కనపడుతుంది. జోర్ధార్ ఇటీవల పత్రికా రూపంలో బయటకు వచ్చిన విషయం బహుశా ఆయనకు ఎవరు చెప్పి ఉండకపోవచ్చు. ఒక మండలంలో జరిగిన వ్యవహారం అక్షరాల సాక్ష్యాలతో జోర్ధార్ ప్రచురించింది. పూర్తి ఆధారాలు ఉన్నాయి. ఆ పెద్దసార్ బహుశా ఈయన సంఘమో, లేదా ఈయన స్నేహితుడో, అందులో ఏమైనా వాటా ముట్టిందో కానీ ఆ కథనం సాంఘిక మాధ్యమంలో పెట్టిన మరొక సంఘం బాధ్యుడికి ఫోన్ చేసి నోరు నెత్తిలో పెట్టుకొని బెదిరించినట్లు సమాచారం. సమాజాన్ని, అక్రమార్కులను బాగు చేయడం, ప్రక్షాళన చేయడంలో జోర్ధార్ ఎప్పుడూ వెనకడుగు వేయదని మరోసారి హెచ్చరిస్తున్నాం. గతంలో కరీంనగర్ జిల్లా గ్రూప్ లో ఆయన అవినీతి బాగోతం పోస్టు చేస్తున్నారని ఆ గ్రూపు మొత్తం తీసివేసేలా ఒత్తిడి చేసిన సదరు పెద్ద మనిషి ఇటీవల జోర్ధార్ కథనంతో ఆయనకు ఏదో నష్టం జరిగిందని భావించి ఈ విషం కక్కడం ప్రారంభించాడు పత్రికలను కొనడం, పెయిడ్ వార్తలను రాయించడం, విలేఖరులకు శ్వేత, ప్రతిమ వంటి స్టార్ హోటళ్లలో దావతులు ఇచ్చిన అలవాటులో అలాగే ఉంటుందని భావించడం ఆయన అమాయకత్వానికి ప్రతీకగా నిలుస్తుంది. ఆ ఆధారాలతో పాటు, అడ్డగోలుగా ఆయన అనుసరిస్తున్న విధానాలు, ఉద్యోగ విరమణ వయస్సు వచ్చినా ఆయన చేస్తున్న వ్యవహారాలు, ఆయన ప్రతి కదలిక జోర్ధార్ వద్ద సాక్ష్యంగా ఉన్నాయి. త్వరలో వాటితో పెద్ద వరుస కథనాలు రాబోతున్నాయి. కథనం తప్పు అయితే కోర్టును ఆశ్రయించవచ్చు. ఆయనకు అనుకూలంగా రాసే పత్రికలు మాత్రమే సామాజిక మాధ్యమాల్లో రావాలని ఆయన జారీ చేసే హుకుంలు పాటించడానికి ఆయన జీతగాళ్లు కాదనే విషయం ఆయన తెలుసుకోవాలి. ఎఫ్ ఆర్ ఎస్ తో సహా అన్ని బాగోతాలకు ఇక తెర తీసే అవకాశం ఇచ్చిన ఆయనకు పత్రికాముఖంగా ఇలాంటి అవాకులు చెవాకులు పేలితే చట్టం ద్వారా సమాధానం చెప్తాం అని హెచ్చరిస్తున్నాం. జోర్ధార్ డెస్క్

ఫోక్సో కేసులో ఉపాధ్యాయుడిపై చర్యలేవి?
నెల రోజులైనా తేలని వ్యవహారం!

విచారణ నివేదికపై కొనసాగుతున్న ఉత్కంఠ.. బాలికకు రక్షణ కల్పించామని మహిళా శిశు సంక్షేమ శాఖ వెల్లడి



సిరిసిల్ల జోర్ధార్ ప్రతినిధి

చందుర్తి మండలం బండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉపాధ్యాయుడి వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదై నెల రోజులు గడుస్తున్నా, విద్యాశాఖ నుంచి తీసుకున్న చర్యలు ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది. నిందితుడిపై శాఖాపరమైన చర్యలు ఎప్పుడు తీసుకుంటారోనని గ్రామస్థులు ఎదురుచూస్తున్నారు.ఈ వ్యవహారంపై జిల్లా స్థాయి అధికారులతో విచారణ జరిపించినప్పటికీ, నివేదిక సమర్పణ, తదుపరి చర్యలపై స్పష్టత లేకపోవడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విచారణకు వచ్చిన అధికారి పాఠశాల ప్రధానోపాధ్యాయుడినే నివేదిక తయారు చేయాలని కోరినట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. దీంతో విచారణ పారదర్శకతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.మరోవైపు, ఈ ఘటనపై జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీనారాయణ స్పందించారు. బండపల్లి గ్రామానికి వెళ్లి బాలికను పరామర్శించామని, ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిపై ఎఫ్ఐఆర్ నమోదైందని తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారులు పోలీసు శాఖతో సమన్వయం చేసుకుంటూ చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటున్నారని, తాము కూడా బాలికకు రక్షణగా నిలిచామని స్పష్టం చేశారు.ఇదిలా ఉండగా, కొత్తగా జిల్లా విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన అధికారి బండపల్లి పాఠశాలను సందర్శించడంతో ఆయన సమర్పించనున్న విచారణ నివేదికపై విద్యాశాఖ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. కానీ జిల్లా విద్యాశాఖ అధికారిని వివరణపై జోర్ధార్ ప్రతినిధి ఫోన్ చేయగా ఫోన్ మాట్లాడడానికి నిరాకరించారు. ఇప్పటికైనా విచారణ నివేదికను వెల్లడించి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, బాధిత బాలికకు న్యాయం జరిగేలా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో పడకేసిన భద్రత!

■ ఆపరేషన్ థియేటర్లలో అక్రమ వసూళ్ల ఆరోపణలు.. పట్టించుకోని అధికారులు

■ మందుబాబుల ఆగడాలు, వరుస దొంగతనాలతో రోగులు, సిబ్బందిలో ఆందోళన





కరీంనగర్ జోర్ధార్ నిఘా విభాగం

కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్), మాతా శిశు ఆసుపత్రి (ఎంసీహెచ్)లో భద్రతా వైఫల్యాలు, అక్రమ వసూళ్ల ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. పేదలకు మెరుగైన వైద్యం అందించాల్సిన ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే రోగులు, వారి కుటుంబ సభ్యులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఒకవైపు ఆపరేషన్ థియేటర్లలో శస్త్రచికిత్సల అనంతరం రోగుల బంధువుల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తుండగా, మరోవైపు ఆసుపత్రి ఆవరణలో దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలు పెరుగుతున్నాయని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆపరేషన్ థియేటర్లలో వసూళ్ల ఆరోపణలు

ప్రధాన ఆపరేషన్ థియేటర్‌తో పాటు మాతా శిశు ఆసుపత్రిలోని ఆపరేషన్ థియేటర్ల వద్ద అక్రమ వసూళ్లు జరుగుతున్నాయనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. శస్త్రచికిత్స పూర్తయిన అనంతరం రోగుల సహాయకుల నుంచి కొందరు డబ్బులు డిమాండ్ చేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఇలా వసూలైన సొమ్ము ప్రతినెలా కానుకల రూపంలో సంబంధిత ఇన్‌చార్జిలకు చేరుతోందనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. కొన్ని నెలల క్రితం తమ కుటుంబ సభ్యులకు ఆపరేషన్ జరిగిన సమయంలో డబ్బులు వసూలు చేశారని, తాజాగా మరోసారి ఆసుపత్రికి వస్తే మళ్లీ అదే పరిస్థితి ఎదురైందని ఓ రోగి బంధువు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఆసుపత్రి గేటు వద్దే మందుబాబుల హల్‌చల్

ఆసుపత్రి ప్రధాన ద్వారం సమీపంలోనే కొందరు బహిరంగంగా మద్యం సేవించడం, సిగరెట్లు తాగడం నిత్యకృత్యంగా మారిందని ఆరోపణలు ఉన్నాయి. రోగులు, మహిళలు, చిన్నపిల్లలు రాకపోకలు సాగించే ప్రధాన మార్గంలోనే ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నా అడ్డుకునే వారు లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఆసుపత్రి పరిసరాల్లోనే ఇలాంటి పరిస్థితులు నెలకొనడంతో రోగులు, వారి బంధువులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

వరుస దొంగతనాలతో ఆందోళన

గత నెల రోజులుగా ఆసుపత్రి ప్రాంగణంలో దొంగతనాలు పెరిగాయని, రోగులు, వారి బంధువులు, వైద్య సిబ్బంది వస్తువులకు భద్రత లేకుండా పోయిందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సెక్యూరిటీ సిబ్బంది విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, గేట్ల వద్ద సరైన తనిఖీలు లేకపోవడంతో ఆసుపత్రిలోకి ఎవరు వస్తున్నారు, ఎవరు వెళ్తున్నారనే పర్యవేక్షణ కొరవడిందని విమర్శిస్తున్నారు.

పోలీస్ అవుట్‌పోస్ట్ ఉన్నా ప్రయోజనమేంటి?

ఆసుపత్రి ప్రాంగణంలోనే పోలీస్ అవుట్‌పోస్ట్ ఉన్నప్పటికీ పరిస్థితుల్లో మార్పు కనిపించడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. వార్డులతో పాటు ఆసుపత్రి పరిసరాల్లో పోలీసులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట పడటం లేదని ఆరోపిస్తున్నారు. పోలీస్ అవుట్‌పోస్ట్ ఉన్నా భద్రతపై భరోసా లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

ఉన్నతాధికారులు స్పందించాలి

ఆపరేషన్ థియేటర్లలో జరుగుతున్నాయని ఆరోపణలు ఎదుర్కొ ంటున్న అక్రమ వసూళ్లపై ఉన్నతస్థాయి విచారణ చేపట్టి బాధ్యుల పై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఆసు పత్రి ప్రధాన ద్వారం వద్ద మద్యం సేవించడం, ధూమపానం వంటి చర్యలను అరికట్టేందుకు నిరంతర పోలీసు పెట్రోలింగ్ చేపట్టా లని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న భద్రతా సిబ్బందిపై చర్య లు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేద రోగులకు మెరుగైన వైద్యంతో పాటు భద్రత కూడా కల్పిం చాల్సినబాధ్యతఅధికారులపై ఉందని ప్రజలు స్పష్టం చేస్తున్నారు.

ఆస్పత్రిలో అన్ని వర్గాలకు మంచి వైద్యం అందిస్తున్నాం: మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి

కరీంనగర్ జిల్లా ప్రధాన ఆస్పత్రిలో అన్ని వర్గాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె. వీరారెడ్డి తెలిపారు. ఆస్పత్రిలో లంచాలు, అక్రమ వసూళ్లకు ఎలాంటి తావు లేదని స్పష్టం చేశారు. ఎవరైనా సిబ్బంది లంచాలు తీసుకున్నట్లు ఆధారాలతో ఫిర్యాదు చేస్తే బాధ్యులను సస్పెండ్ చేస్తామని వెల్లడించారు. రోగులు ఎవరికీ ముడుపులు ఇవ్వాల్సిన అవసరం లేదని, ఆపరేషన్ థియేటర్లలో డబ్బులు వసూలు చేయరాదని ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు. ఆస్పత్రిలో పోలీసు భద్రతపై పోలీసు శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించామని, గతంతో పోలిస్తే ప్రస్తుతం అన్ని విభాగాల్లో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు.

పంచాయతీ నిధుల వ్యవహారంపై ఫిర్యాదులు.. అధికారుల మౌనం ఎందుకు?

■ రూ.20 లక్షల అభివృద్ధి పనుల బిల్లుల చెల్లింపుల్లో వివాదం చెక్కులు జారీ చేయడం లేదంటూ కలెక్టర్‌కు రెండుసార్లు ఫిర్యాదు



పెద్దపల్లి, జోర్ధార్ ప్రతినిధి: పెద్దపల్లి జిల్లాలో గ్రామపంచాయతీ నిధులు, అభివృద్ధి పనుల బిల్లుల చెల్లింపుల వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. మంథని మండల పరిధిలోని ఖమ్మంపల్లి గ్రామపంచాయతీలో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి సుమారు రూ.20 లక్షల అంచనా వ్యయంతో పనులు చేపట్టినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ పనులకు సంబంధించి పార్ట్-1 బిల్లుకు రూ.8,93,856, పార్ట్-2 బిల్లుకు రూ.7,38,642, పార్ట్-3, ఫైనల్ బిల్లులకు రూ.3,44,956 చెల్లింపుల వ్యవహారం ఉన్నట్లు పత్రాల్లో వివరించారు.అయితే బిల్లుల చెల్లింపులు, చెక్కుల జారీ విషయంలో జాప్యం జరుగుతోందని బాధితుడు ఆరోపిస్తున్నారు. ఈ సమస్యపై గతంలో 2025 డిసెంబర్ 22న జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు పత్రాలు వెల్లడిస్తున్నాయి. 2026 జూలై 2, జూలై 17 తేదీల్లోనూ పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మరో రెండు పిటిషన్లు అందజేసినట్లు బాధితుడు తెలిపారు. సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మరోవైపు గ్రామపంచాయతీల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, నిధుల వినియోగం, బిల్లుల చెల్లింపులపై వచ్చిన ఆరోపణలపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని బాధితుడు కోరుతున్నారు. వరుసగా ఫిర్యాదులు అందుతున్నా జిల్లా స్థాయి అధికారులు స్పందించకపోవడంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అసలు బిల్లుల చెల్లింపుల్లో జాప్యానికి కారణాలేంటి? ఫిర్యాదులపై విచారణ చేపట్టారా? బాధ్యులపై ఏమైనా చర్యలు తీసుకున్నారా? అనే అంశాలపై జిల్లా అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఆరోపణలపై విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని బాధితుడు కోరుతున్నారు.

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్ JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం

నాగ పంచమి



కార్తీక మాసం ఆరంభం
యేతెంచిన శుభదినం
పరమపవిత్రమీతరుణం
నాగపంచమి పర్వదినం!

ఆధ్యాత్మిక ప్రాముఖ్యం
నాగదేవతపూజకుప్రసిద్ధం
తొలగును నాగదోషం
అని ప్రగాఢ విశ్వాసం!

రాహు,కేతు దుష్ప్రభావం
తొలగాలనివేడుకగభక్తజనం
నాగదోష పరిహార్థం
నాగ దేవత ఆరాధనం!

పాలతో అభిషేకం
పాముపుట్టనఫలహారం
భక్తితోచేసేటిపూజలపుణ్యం
పొందుదురుకలకాలం..!

నాగపంచమి పర్వదినం
నిష్ఠగచేసినపూజఉపవాసం
తొలగిపోవునునాగదోషం
పొందుదురుపుణ్యఫలం..!!



ఎన్.రాజేష్-ఎమ్మెస్సి
కవి,జర్నలిస్ట్-హైదరాబాద్

చైతన్నకు భరోసా

రత్నాపూర్‌లో ధాన్యం కొనుగోళ్లకు శ్రీకారం!



- ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి
- సర్పంచ్ ప్రతిమ, మార్కెట్ కమిటీ చైర్మన్ వైనాల రాజు

రామగిరి, జోర్దార్ ప్రతినిధి:రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు, ప్రభుత్వ మద్దతు ధరను అందించడమే లక్ష్యంగా రామగిరి మండలం రత్నాపూర్ గ్రామంలో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు, కమాన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వైనాల రాజు ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి రిబ్బన్ కట్ చేసి కొనుగోళ్లకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే తమ ధాన్యాన్ని విక్రయించి పూర్తి మద్దతు ధర పొందాలని సూచించారు. ప్రభుత్వం ఏడు రకాల సన్నధాన్యానికి మద్దతు ధరతో పాటు క్వింటాలుకు రూ.500 బోనస్ అందిస్తోందని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా లబ్ధి పొందాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం దొమ్మేటి పద్మ, మండల కాంగ్రెస్ నాయకులు తులసిరామ్, మాజీ జడ్పీటీసీ గంట వెంకట రమణారెడ్డి, ఖండే పోచం, మట్ట రాజుకుమార్, కొండు అంజన్న, డైరెక్టర్ ప్రవీణ్, సందేవేన కుమార్, ఇరవేన శ్రీధర్, జే. సది, ఐకేపీ సీసీలు బత్తుల శంకర్, వైనాల రాజు, సీఏ కలికోట సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

నాగుల పంచమి వేడుకల్లో

పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు



- ప్రజలకు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించిన డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు గొర్రె కిరణ్ కుమార్

హసన్‌పర్తి,జోర్దార్ ప్రతినిధి:గ్రేటర్ వరంగల్ నగరంలోని 66వ డివిజన్ హసన్‌పర్తిలో నాగుల పంచమి పర్వదినాన్ని పురస్కరించుకొని పాపిరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా 66వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొర్రె కిరణ్ కుమార్ మాట్లాడుతూ..హిందూ సంప్రదాయంలో నాగుల పంచమికి ఎంతో విశిష్టమైన స్థానం ఉందని ప్రతి ఒక్కరూ ఈ పండుగను భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని కోరారు. నాగదేవత ఆరాధన మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని,ఈ పర్వదినం సందర్భంగా ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, వెల్లివిరియాలని, డివిజన్ ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మాజీ డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్, ఆరెల్లి వెంకటస్వామి, పెద్దమ్మ నరసింహారావు,బి గుళ్ల సురేష్ ,గరిగే రాజు,డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లి ఆర్డీఓ కార్యాలయం వద్ద సమస్యలు

పట్టించుకునే వారేరీ?

- అధ్వానంగా రహదారి.. ప్రమాదకరంగా గుంత..
  అస్తవ్యస్తంగా పార్కింగ్
- కనీస సౌకర్యాలు కల్పించాలని ప్రజల విజ్ఞప్తి



పెద్దపల్లి, జోర్దార్ ప్రతినిధి:
పెద్దపల్లి పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం వద్ద రహదారి సరిగా లేకపోవడం, పెద్ద గుంత ఏర్పడటం, సరైన పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో కార్యాలయానికి వచ్చే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వివిధ పనుల నిమిత్తం నిత్యం ఎంతోమంది ఈ కార్యాలయానికి వస్తుంటారు. అయితే కార్యాలయం వద్ద కనీస సౌకర్యాలు లేకపోవడం ఇబ్బందికరంగా మారిందని ప్రజలు అంటున్నారు.

రహదారి మరమ్మతులు చేపట్టాలి
కార్యాలయానికి వెళ్లే దారి అధ్వానంగా ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని ప్రజలు చెబుతున్నారు. కార్యాలయ ప్రాంగణం వద్ద ఉన్న పెద్ద గుంతను వెంటనే పూడ్చాలని, లేదంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు.

పార్కింగ్ సౌకర్యం కల్పించాలి
కార్యాలయానికి వచ్చే వారు తమ వాహనాలను నిలిపేందుకు సరైన స్థలం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంటున్నారు. వాహనాలను క్రమపద్ధతిలో నిలిపేలా ప్రత్యేక పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తున్న ప్రజలు
జిల్లా కేంద్రంలోని కీలక ప్రభుత్వ కార్యాలయం వద్ద ఇలాంటి సమస్యలు ఉండటం గమనించాల్సిన విషయమని ప్రజలు అంటున్నారు.
జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష స్పందించి రహదారి మరమ్మతులు, గుంత పూడ్చివేత, పార్కింగ్ సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.
సంబంధిత అధికారులు కార్యాలయ పరిసరాలను పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తే ప్రజలకు ఇబ్బందులు తగ్గుతాయని అభిప్రాయపడుతున్నారు.

పత్తి సాగుపై రైతులకు శాస్త్రీయ అవగాహన



టేకుమట్ల జోర్దార్ ప్రతినిధి:జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండల కేంద్రంలోని రైతువేదికలో ఆత్మ ఆధ్వర్యంలో ఆశిరెడ్డిపల్లి గ్రామ రైతులకు పత్తి పంటపై క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి ఎం. కళ్యాణి మాట్లాడుతూ..
పత్తి సాగులో శాస్త్రీయ పద్ధతులు, ఎరువుల యాజమాన్యం, సమగ్ర పోషక యాజమాన్యం, నీటి యాజమాన్యం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. రైతులకు మట్టి ఆరోగ్య పత్రాలు అందజేశారు. ఎల్‌నినో ప్రభావంతో నీటి లభ్యత తగ్గే అవకాశం ఉన్నందున యాసంగిలో వరికి బదులుగా తక్కువ నీటితో పండే పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, కూరగాయలు సాగు చేయాలని సూచించారు. సూక్ష్మ సేద్య పద్ధతుల ద్వారా ప్రతి నీటి బొట్టును సమర్థవంతంగా వినియోగించుకోవాలని, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకొని అనవసర పెట్టుబడులతో నష్టపోకుండా జాగ్రత్త పడాలని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త కె. మదన్ మోహన్ రెడ్డి, ఆశిరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ జెట్టి కుమారస్వామి, ఉపసర్పంచ్ మారం రామచంద్రారెడ్డి, ఏఈఓ ఆర్. అరుణ్, రైతులు పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిర్మూలనకు

100 రోజుల విస్తృత ప్రచారం



టేకుమట్ల జోర్దార్ ప్రతినిధి:బాల్యవివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనతో పాటు ప్రతి చిన్నారికి విద్య, రక్షణ, భద్రత కల్పించాలనే లక్ష్యంతో దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాల్లో జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్, షేర్ ఎన్జీవో ఆధ్వర్యంలో 100 రోజుల విస్తృత ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా టేకుమట్ల మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) హాస్టల్‌లో బాల్యవివాహాల నిర్మూలన పోస్టర్‌ను విద్యాశాఖ అధికారులు, పోలీసుల చేతుల మీదుగా ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా జిల్లా ప్రాజెక్టు కోఆర్డినేటర్ తిరుపతి శాస్త్రాల మాట్లాడుతూ.. గ్రామాలు, పట్టణాల్లో బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు బాలికల విద్య ప్రాధాన్యత, బాలల హక్కులు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై విస్తృత ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామస్థాయిలో ర్యాలీలు, సమావేశాలు, అవగాహన కార్యక్రమాలు చేపట్టి బాల్యవివాహాలు లేని సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.
బాల్యం బడిలోనే వికసించాలని, బాలికల భవిష్యత్తుకు బాల్యవివాహాలు అడ్డుకాకూడదని, చిన్నారుల హక్కుల పరిరక్షణకు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సుధాకర్, కేజీబీవీ ప్రిన్సిపాల్ స్వప్న, టేకుమట్ల పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ రవీందర్, షేర్ జేఆర్సీ జిల్లా కోఆర్డినేటర్ తిరుపతి శాస్త్రాల, మండల సోషల్ మొబిలైజర్ బోయిని శ్రీజ, కేజీబీవీ ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

హుజురాబాద్ క్లబ్ ఎన్నికల్లో గెలుపుపై

కట్కూరి మల్లారెడ్డి ప్యానెల్ ధీమా!

- కొత్త కార్యవర్గం వైపు సభ్యుల మొగ్గు..
- ప్రచారంలో దూసుకుపోతున్న అభ్యర్థులు



హుజురాబాద్,జోర్దార్ ప్రతినిధి:హుజురాబాద్ క్లబ్ ఎన్నికలు పట్టణంలో తీవ్ర ఉత్కంఠను రేపుతున్నాయి.ఆదివారం జరగనున్న పోలింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.గతంలో ఏకగ్రీవంగా జరిగిన ఎన్నికలు ఈసారి రెండు ప్యానళ్ల మధ్య పోటీకి దారితీశాయి.దీంతో క్లబ్ సభ్యులతో పాటు పట్టణ ప్రముఖుల్లోనూ ఎన్నికల ఫలితాలపై ఆసక్తి నెలకొంది.
క్లబ్ ఎన్నికల్లో కట్కూరి మల్లారెడ్డి ప్యానెల్, ముచ్చ నారాయణరెడ్డి ప్యానెల్ పోటీ పడుతున్నాయి. కట్కూరి మల్లారెడ్డి ప్రధాన కార్యదర్శి పదవికి బరిలో ఉండగా, ఆయన ప్యానెల్‌లోని అభ్యర్థులు గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు.నాగార్జున డెయిరీ చైర్మన్ పుల్లూరి ప్రభాకర్‌రావు ఉపాధ్యక్ష పదవికి పోటీ చేయడంతో ఈ ప్యానెల్‌కు మరింత బలంగా మారింది. కోశాధికారిగా ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన గర్రెపల్లి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ మంద ఉమాదేవి భర్త మంద రమేష్ (ఆర్కే) పోటీలో ఉన్నారు.ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుల స్థానాలకు సీనియర్ పాత్రికేయులు కేశిరెడ్డి నరసింహారెడ్డి,గడ్డం ధర్మారెడ్డి,పండ్ల సమ్మయ్య, మేకల రాజిరెడ్డి,పొన్నగంటి శ్రవణ్ కుమార్,జున్నోజు రాజేందర్, అకినపల్లి అనిల్ కుమార్, విష్ణుదాసు గోపాలరావు, మాగంటి శ్రీధర్ తదితరులు బరిలో ఉన్నారు.

కొత్త కార్యవర్గానికి అవకాశం ఇవ్వాలనే అభిప్రాయం
హుజురాబాద్ క్లబ్ అభివృద్ధిలో మాజీ ఎంపీ, క్లబ్ గౌరవ అధ్యక్షుడు కెప్టెన్ లక్ష్మీకాంతరావు కృషి ఎంతో ఉందని సభ్యులు గుర్తుచేస్తున్నారు.ఆయన ఆధ్వర్యంలో క్లబ్ పునరుద్ధరణతో పాటు స్విమ్మింగ్ పూల్,ఇండోర్ స్టేడియం,టెన్నిస్ కోర్టు, ఫంక్షన్ హాల్, జిమ్,లైబ్రరీ వంటి సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. కొత్త సభ్యులకు కార్యవర్గంలో అవకాశం కల్పిస్తే క్లబ్ అభివృద్ధికి మరింత ఉత్సాహంగా పనిచేస్తారనే అభిప్రాయం సభ్యుల్లో వ్యక్తమవుతోంది.
సభ్యత్వ సంఖ్యను పెంచడంతో పాటు క్లబ్ ఆధ్వర్యంలో విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని, నిరుపేదలకు సహాయం అందించే కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలని పలువురు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో కొత్త కార్యవర్గం ఏర్పాటుకు మెజారిటీ సభ్యులు మొగ్గు చూపుతున్నారనే చర్చ సాగుతోంది.హుజురాబాద్ క్లబ్‌లో మొత్తం 326 మంది సభ్యులు ఉండగా, సుమారు 90 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. తొలుత ఏకగ్రీవ ఎన్నికల కోసం ప్రయత్నాలు జరిగినప్పటికీ అవి ఫలించకపోవడంతో పోటీ అనివార్యమైంది.పోటీలో ఉన్న అభ్యర్థులంతా క్లబ్ గౌరవ అధ్యక్షుడు కెప్టెన్ లక్ష్మీకాంతరావును మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు.
మరోవైపు రాజకీయాలకు అతీతంగా కట్కూరి మల్లారెడ్డి తన ప్యానెల్ అభ్యర్థులతో కలిసి సభ్యులను వ్యక్తిగతంగా కలుస్తూ ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి తమ ప్యానెల్‌కు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు.మొత్తంగా హుజురాబాద్‌లో ఎక్కడ చూసినా క్లబ్ ఎన్నికల గురించే చర్చ జరుగుతోంది. ప్రముఖులు, వ్యాపారవేత్తలు, పాత్రికేయులు సభ్యులుగా ఉన్న క్లబ్ ఎన్నికల ఫలితాలు ఎలా ఉండబోతున్నాయన్నది ఆసక్తికరంగా మారింది.

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం

తీన్మార్ మల్లన్న కారుపై దాడి హత్యాయత్నమే

- బీసీల ఎదుగుదలను ఓర్వలేకే కుట్ర
- ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలి
- బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్




హనుమ కొండ,జోర్దార్ ప్రతినిధి: బీసీ రాజ్యాధికార యాత్ర ద్వారా రాష్ట్రవ్యాప్తంగా బీసీలను చైతన్య పరుస్తున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కారుపై లారీ తో జరిగిన దాడిని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ తీవ్రంగా ఖండించారు.శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..మల్లన్న కారును లారీతో ఢీకొట్టిన తీరు చూస్తుంటే ఇది సాధారణ రోడ్డు ప్రమాదం కాదని,పక్కా ప్రణాళికతో చేసిన హత్యాయత్నంగా అనుమానాలు వ్యక్తమవుతున్నా యని అన్నారు.ఈ ఘటనలో తీన్మార్ మల్లన్న కారులో లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిం దని,కారు పూర్తిగా ధ్వంసమైన తీరు చూస్తే దాడి తీవ్రత అర్థమవుతోందన్నారు. కారులో ప్రయాణి స్తున్న ముగ్గురికి తీవ్ర గాయాలవడం బాధా కరమని పేర్కొన్నారు.

రాష్ట్ర జనాభాలో 56 శాతం ఉన్న బీసీలు రాజకీ యంగా, ఆర్థికంగా ఎదుగుతూ, రాజ్యాధికారం కోసం ఐక్యమవుతున్న తరుణంలో వారి చైతన్యా న్ని అడ్డుకోవాలనే ఆధిపత్య శక్తులు ఇలాంటి దాడులకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. బీసీలను ఎప్పటికీ అణగదొక్కాలనే భావజాలమే ఈ కుట్ర వెనుక ఉందని విమర్శించారు.గతంలో బీసీల హక్కుల కోసం పోరాడిన బెల్లి లలిత, మారోజు వీరన్న, సాంబశివరాజు వంటి నాయకు లపై జరిగిన దాడులను గుర్తుచేస్తూ, ఇప్పుడు మల్లన్న విషయంలోనూ అలాంటి పరిస్థితులు పునరావృతం కావాలనుకుంటున్నారా అని ప్రశ్నించారు.ఈ ఘటనను పోలీసులు సాధారణ రోడ్డు ప్రమాదంగా పరిగణించ కుండా హత్యా యత్నం కోణంలో సమగ్ర విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. లారీ డ్రైవర్ వెనుక ఉన్న అసలు సూత్రధారులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని,ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు ప్రభుత్వం తక్షణమే తగిన భద్రత కల్పించాలని కోరారు.బీసీ నాయకులపై దాడులను సహించేది లేదని, ప్రభుత్వం స్పందించని పక్షంలో ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా బీసీలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతారని వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ హెచ్చరించారు.

పలు కార్యక్రమాల్లో పాల్గొన్న మండల

కాంగ్రెస్ అధ్యక్షుడు తిప్పిరెడ్డి కృష్ణారెడ్డి



- టేకుమట్ల మండలంలో కాంగ్రెస్ అధ్యక్షుడి పర్యటన

టేకుమట్ల జోర్దార్ ప్రతినిధి:టేకుమట్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తిప్పిరెడ్డి కృష్ణారెడ్డి శు క్రవారం మండలంలోని ఎంపేడు, గర్మిళ్లపల్లి గ్రా మాల్లో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఎంపేడు గ్రామానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ సట్ల కొమురయ్య కుమారుడి వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాం క్షలు తెలిపారు. అనంతరం గర్మిళ్లపల్లి గ్రామంలో కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి దాసారపు సదానందం తండ్రి లింగయ్య దశదినకర్మకు హాజరై చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.

కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం



ఆదిలాబాద్,జోర్దార్ ప్రతినిధి:ఆదిలాబాద్ పట్టణం లోని అగ్నిమాపక కేంద్రంలో శుక్రవారం పాఠశా ల విద్యార్థులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్టేషన్ ఫైర్ ఆఫీసర్ జైత్ రామ్ మాట్లాడుతూ.. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, రక్షణ చర్యలపై విద్యార్థులకు వివర ంగా వివరించారు. ప్రమాదాల సమయంలో ఎలా అప్రమత్తంగా ఉండాలో ప్రదర్శించి చూపించారు.

సమాజంలో మానవీయ సంబంధాలు

మానవులు సంఘజీవులు. మనిషికి మనిషికి ఏ చుట్టరికం లేకపోయినా మనుష్యులుగా
పుట్టడం చేత వారి మధ్య ఉండేది మానవీయ సంబంధం.
మనల్ని మనం ఎంతగా గౌరవించు కుంటామో అదేవిధంగా తోటిమానవుని గౌరవించాలి.
పరోపకారమే గొప్ప గుణం అని అష్టాదశ పురా ణాల సారాంశం ఇదేనని పెద్దలు చెబుతుంటారు.
రామాయణ,మహాభారత, భాగవతాది గ్రంథాలు చదవడం వల్ల మానవతావిలువలు అల వడతాయి.
శతక పద్యాలు బాల్యంలో పిల్లలకు నేర్పించడం వల్ల నీతిని నేర్చుకునే అవకాశం ఉంది.
దధీచి, శిబి చక్రవర్తి వంటి కథలు పిల్లలు వినాలి.
తల్లిదండ్రులకు ఉద్యోగాల రీత్యా పిల్లలకు చెప్పే తీరిక ఉండదు.పెద్దవారు సెలవుల్లో
చెప్పడానికి ప్రయత్నించినా చరవాణి వ్యామోహం వల్ల పిల్లలు వినరు.
కానీ ఏదో సమయంలో బుజ్జగిస్తూనే నీతికథలు చెప్పాలి.
ప్రార్థించే పెదవులకన్నా సాయం
చేసే చేతులు మిన్నయని తెలిపే
మదర్ థెరిస్సా గూర్చి తెలపాలి."సొంతలాభం కొంత మానుకొని పొరుగు వాడికి తోడ్పడవోయి" అన్న గురజాడ
గూర్చి,"స్వార్థమేఅనర్థదాయకం
అది చంపుకొనుటే క్షేమదాయకం" అన్న శ్రీశ్రీ గూర్చి
లోకంలో ఉన్న నిస్వార్థసేవకుల
గూర్చి బాలలకు తెలపాలి.నేటి బాలలు రేపటి భావిభారత పౌరులు కాబట్టి చిన్నతనంలోనే
మానవీయ విలువలు ,నైతిక
విలువలు నేర్పాలి.మొక్కై వంగనిదే మానై వంగదు కదా.
మానవుడు వైజ్ఞానికంగా ఎంతో సాధించాడు. యంత్రాలని కనిపెట్టి తానూ ఒక యంత్రంలా మారిపోతున్నాడు.
మానవీయ సంబంధాలన్నీ నేడు డబ్బుతో ముడిపడి ఉన్నాయి.అందువల్ల డబ్బు సంపా దించడం మాత్రమే ధ్యేయంగా బతుకుతున్నారు.
కుటుంబ సభ్యుల మధ్య ఐక్యత కొరవడి ంది.సహజ ప్రేమానురాగాలు కనిపించడంలేదు.
కుటుంబం లోనే ఐక్యభావన లేకుంటే తోటి వారిని ఎలా చూస్తారు? ఏదైనా
డబ్బుతో కొనగలమేమో! కానీ
ప్రేమ,ఆప్యాయత,అనురాగం
కోట్లు కుమ్మరించినా కొనలేము.
ఈ సత్యాన్ని విస్మరించక మనమూ బాగుండాలి. పరుల
హితం కోరాలి.పరస్పర సహాయ సహకారాలు మేలుచేస్తాయి.వ్యక్తి వ్యక్తికి మధ్య మేలు,కుటుంబా లకు,తద్వారా సమాజానికి, తద్వారా దేశాభివృద్ధికి మేలుకలుగుతుంది. సత్యం, ధర్మం,దయ
నిలవాలి.స్వార్థం,వైషమ్యం,ఈర్ష్య,ద్వేషాలు వర్గ సంఘర్షణకు దారి తీస్తాయి.
మానవీయ విలువలు,నైతిక విలువలు ప్రతిమనిషి కలిగివుంటే ప్రశాంతంగా సంఘంలో మనుగడ సాగించగలము.
మహోన్నతమైన మానవీయ సంబంధాలు, విలువలు కాపాడుకోవాలంటే వాటి గొప్పదనాన్ని చాటిచెప్పే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు
కవులు,కవయిత్రులు, సాహితీవేత్తలు,పెద్దలు తమ వంతు కృషిచేయాలి. మానవత్వం పరిమళించే మంచి సమాజానికి మనం
బాసటగా నిలుద్దాం.



సిరిపురం వాణిశ్రీ
వి.ఉపన్యాసకురాలు
కరీంనగర్

ప్రత్యామ్నాయ పంటల సాగుపై

రైతులకు అవగాహన



ఆదిలాబాద్,జోర్దార్ ప్రతినిధి:రాబోయే రబి 2026-27 సీజన్ లో ప్రాజెక్టుల్లో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటల సాగు ప్రణాళిక రూపొందిం చాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజర్షి షా, అధికారులు పాల్గొన్నారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో వరి సాగును తగ్గించి, ఇతర ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు రైతులు మొగ్గు చూపేలా చేయాలన్నారు.

ఆదిలాబాద్ విమానాశ్రయానికి

వడివడిగా అడుగులు

- మూడు వాగుల మళ్లింపునకు 324 కోట్లతో ప్రతిపాదనలు



ఆదిలాబాద్,జోర్దార్ ప్రతినిధి: ఆదిలాబాద్ జిల్లా కేం ద్రంలో విమానాశ్రయ ఏర్పాటుకు పనులు వేగ వంత మవుతున్నాయి.ఇప్పటికే 2,008 ఎకరాల భూసేకరణకు నోటిఫికేషన్ విడుదల చేయగా, తాజాగా ప్రతిపాదిత విమానాశ్రయ ప్రాంతంలో ప్రవహించే మూడు వాగులను మళ్లించేందుకు నీటిపారుదల శాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందుకోసం రూ.324.78 కోట్ల అంచనా వ్యయంతో టెండర్లు ఆహ్వా నించా రు.విమానాశ్రయానికి భవిష్యత్తులో వరద ముప్పు తలెత్తకుండా వాగుల ప్రవాహాన్ని మళ్లించి, విమా నాశ్రయ సరిహద్దు వెలుపల ప్రత్యేక కాలువలు నిర్మించనున్నారు.సుమారు 5.4 కిలోమీటర్ల మేర ప్రవహించే వాగుల నీటిని టాక్లీ గ్రామ శివారు మీదుగా సాత్నాల ప్రాజెక్టు నుంచి వచ్చే వాగులో కలిపేలా ప్రణాళిక రూపొందించారు.
భారీ వర్షాలు,వరదలు వచ్చినా విమానాశ్రయ ంలోకి నీరు చేరకుండా హైగ్రేడ్ కాంక్రీటుతో పటిష్టమైన కాలువలు,రక్షణ నిర్మాణాలు చేపట్ట నున్నారు.ఈ పనులు పూర్తయితే విమానాశ్రయ నిర్మాణానికి కీలక అడ్డంకి తొలగనున్నట్లు భావిస్తున్నారు.

పోచమ్మ తల్లి ఉత్సవాలు విజయవంతం

సర్పంచ్‌కు గ్రామస్తుల ఘన సత్కారం

- గ్రామస్తుల సహకారంతోనే ఉత్సవాలు విజయవంతమయ్యాయి: సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు



రామగిరి, జోర్దార్ ప్రతినిధి:గ్రామదేవత పోచమ్మ తల్లి కొలుపు ఉత్సవాలు విజయవంతంగా ముగియ డంతో రత్నాపూర్ గ్రామంలో సంతోషం వెల్లివిరి సింది. ఐదేళ్లకోసారి నిర్వహించే ఈ ఉత్సవాలను రెండు రోజుల పాటు గ్రామస్తులంతా ఏకతా టిపైకి వచ్చి భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతో పం డుగ వాతావరణం నెలకొంది. ఉత్సవాల నిర్వహ ణలో సహకరించి, విజయవంతం చేసినందుకు గుర్తింపుగా గ్రామస్తులు శుక్రవారం గ్రామ సర్ప ంచ్ పల్లె ప్రతిమ పీవీరావును ఘనంగా సన్మా నించారు.ఈ సందర్భంగా సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు మాట్లాడుతూ.. గ్రామస్తులందరి సహ కారం, సమిష్టి కృషి వల్లే పోచమ్మ తల్లి ఉత్సవాలు విజయవంతమయ్యాయని తెలిపారు. గ్రామ ప్రజల ఐకమత్యం, భక్తిభావం ఈ వేడుకల్లో ప్రతి బింబించాయని పేర్కొన్నారు. పోచమ్మ తల్లి ఆశీ స్సులతో గ్రామం సుభిక్షంగా ఉండాలని, ప్రజల ందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఐదేళ్లకోసారి జరిగే ఈ పవిత్ర ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొ న్న ప్రతి ఒక్కరికీ ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలి పారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సందేవేన కుమార్, పబ్బ మొగిలి, పబ్బ వెంకటేశ్, జక్కుల చందన్, కెక్కర్ల అశోక్, ఓర్రె సురేష్, కొండు వేణు, ముక్కెర కుమార్, కెక్కర్ల మోహన్, ధర్ముల సంజీవ్, ముక్కెర మోహన్, మన్నాల రా హుల్, బెజ్జాల లక్కీ తిరుపతి, జక్కుల రాజయ్య, మండల శంకర్, బాద్రపు కృష్ణమూర్తి, బోగే సతీ ష్, దాసరి మల్లి, కెక్కర్ల సమ్మయ్య, ఉడుత అనిల్, కండె కిష్టయ్య, పనగంటి ప్రశాంత్, కొండపర్తి నరసింహచారి, కొండపర్తి అమరేందర్ చారి, కేశవేన మల్లేష్, నగునూరి సతీష్, పనగంటి వీరే శం, అబ్బా నరేష్, జక్కుల మహేష్, బెజ్జుల శం కర్, బెజ్జుల రమేష్, మన్నాల సతీష్, ధంకా రాజ్ కుమార్, ధంకా సధిం, బెజ్జాల రాజేందర్ తది తరులు పాల్గొన్నారు.

మద్దతు ధరను మించి సోయాబీన్‌కు

ధర..రైతుల్లో ఆనందం



ఆదిలాబాద్,జోర్దార్ ప్రతినిధి:ప్రైవేట్ మార్కెట్లలో సోయాబీన్ ధరలు భారీగా పెరగడంతో ఆదిలా బాద్ జిల్లా రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాల్‌కు రూ.5,708 కాగా, ప్రస్తుతం ప్రైవేట్ మార్కెట్లలో రూ.7,000కు పైగా ధర పలుకుతోంది.
దిగుబడి తగ్గడం, మార్కెట్‌లో సోయాబీన్‌కు డిమా ండ్ పెరగడంతో ధరలు పెరుగుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు.రానున్న రోజుల్లో ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని అం చనా వేస్తున్నారు. మద్దతు ధర కంటే అధిక ధర లభిస్తుండటంతో రైతులు తమ సోయాబీన్ పం టను ప్రైవేట్ మార్కెట్లకు తరలిస్తున్నారు. గతంతో పోలిస్తే మెరుగైన ధరలు రావడం పట్ల రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మత్తు పదార్థాల నిర్మూలనకు విస్తృత ప్రచారం



ఆదిలాబాద్,జోర్దార్ ప్రతినిధి:మత్తుపదార్థాల వినియో గం వల్ల కలిగే అనర్థాలపై యువతకు అవగాహన కల్పించి, మత్తుపదార్థాల రహిత సమాజ నిర్మా ణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ రాజర్షి షా సూచించారు.
నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా రూపొందించిన మత్తు పదార్థాల నివారణ ప్రచార పోస్టర్లు శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆవిష్కరించారు.
అదనపు కలెక్టర్ రాజేశ్వర్, జిల్లా విద్యా అధికారి మాధవి, రెడ్క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ మనోహర్ రావు పాల్గొన్నారు.

ఘనపురం మండలంలో 23 మంది లబ్ధిదారులకు

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

- పేద కుటుంబాల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



భూపాలపల్లి జోర్దార్ ప్రతినిధి:జయశంకర్ భూపాల పల్లి నియోజకవర్గంలోని ఘనపురం మండలానికి చెందిన వివిధ గ్రామాల 23 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద మంజూరైన చెక్కులను భూపాలపల్లి ఎమ్మెల్యే గం డ్ర సత్యనారాయణ రావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు చెక్కులు అందజేసి శు భాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మా ట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేద, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. ఆడపిల్లల వివాహం తల్లిదండ్రు లకు ఆర్థిక భారం కాకూడదనే ఉద్దేశంతో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందని పేర్కొన్నారు. మహిళల సంక్షేమం, ఆర్థిక భద్రత, పేద కుటుంబాల అభ్యున్నతే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొ క్కటిగా అమలు చేస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభు త్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సంబంధిత అధికారులు, లబ్ధిదా రులు తదితరులు పాల్గొన్నారు.

బాలల దినోత్సవం సందర్భంగా

విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు



- ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేత

హుజూరాబాద్,జోర్దార్ ప్రతినిధి:బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని హుజూరాబాద్‌కు చెందిన గంగి శెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు.ఎంజేపీ గాంధీనగర్ బాలి కల పాఠశాల,లింగాల ఎక్స్‌రోడ్‌లోని రేగొండ పాఠశాల విద్యార్థులకు ఈ పోటీలను నిర్వహించి వారిలోని సృజనాత్మకతను, ప్రతిభను వెలికితీసే ప్రయత్నం చేశారు.ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ట్రస్ట్ నిర్వాహకులు, రిటైర్డ్ ఉపాధ్యాయులు డాక్టర్ గంగిశెట్టి జగదీ శ్వర్, పాఠశాల ప్రిన్సిపాల్ జి. విజయ చేతుల మీదుగా శంకర్ నారాయణ డిక్షనరీలు, షీల్డులను బహుమతులుగా అందజేశారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జి. విజయ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ కష్టపడి ఉన్నత లక్ష్యా లను సాధించాలని, రాష్ట్రస్థాయిలో మంచి ర్యాం కులు సాధించి పాఠశాలకు,తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని సూచించారు.విద్యార్థుల అభివృ ద్ధికి,పేదల సంక్షేమానికి గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ చేస్తున్న సేవా కార్యక్రమాలను ఆమె అభినందించారు.ట్రస్ట్ నిర్వాహకులు డాక్టర్ గంగిశెట్టి జగదీశ్వర్ మాట్లాడుతూ 2011 సం వత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో పాటు సమాజంలోని పేదలకు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.దేశ నా యకుల జయంతి, వర్ధంతి సందర్భాలను పురస్క రించుకుని వారి ఆశయాలు,సేవలు, ఆదర్శాలను నేటి తరానికి తెలియజేయాలనే ఉద్దేశంతో ఇలాం టి కార్యక్రమాలను చేపడుతున్నట్లు వివరించారు. వ్యాసరచన పోటీల్లో ఎం. అక్షిత, ఐ. మోక్ష మొద టి ఇద్దరు విజేతలుగా నిలవగా, చిత్రలేఖన పోటీల్లో సీహెచ్. అక్షిత,పి.శివాజీ ప్రతిభ కనబ రిచారు.వీరికి డిక్షనరీలు,షీల్డులను బహూకరి ంచారు. విజేతలను ఉపాధ్యాయ బృందం అభినం దించింది.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి. కరుణ, ఆర్. విజయలక్ష్మి, కేఎంఏ ప్రియదర్శిని, ఎస్. రోజా, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన సదస్సు



ఆదిలాబాద్,జోర్దార్ ప్రతినిధి:రేపు జరగబోయే బాల ల దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు బాలల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పి ంచేందుకు కేజీబీవీ మావలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.హుస్సేన్ మాట్లాడుతూ ప్రతి బాలబాలికలకు విద్య, ఆరోగ్యం, రక్షణ, సమాన అవకాశాలు కల్పించడం సమాజంలోని ప్రతి ఒ క్కరి బాధ్యత అని తెలిపారు.
బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు, బాలలపై జరిగే వేధింపులు, రక్షణ చట్టాల గురించి వివరించారు.

ఆత్మకూరు ఎస్సైగా మామిడాల కుమారస్వామి

బాధ్యతల స్వీకరణ




ఆత్మకూరు,జోర్దార్ ప్రతినిధి:ఆత్మకూరు పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా మామిడాల కుమారస్వామి నియమితులై బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఎస్సై కుమారస్వామి మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు.అసాంఘిక కార్యకలాపాలు,అక్రమాలు, నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పోలీస్ శాఖ ద్వారా అందించాల్సిన సేవలను మరింత మెరుగుపరుస్తామని చెప్పారు. ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులను నిర్భయంగా పోలీసుల దృష్టికి తీసుకురావాలని, ప్రతి ఫిర్యాదుపై చట్టపరిధిలో విచారణ జరిపి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముఖ్యంగా మహిళలు,యువతులు, వృద్ధుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు.ప్రజలు, పోలీసుల మధ్య సత్సంబంధాలు నెలకొల్పుతూ శాంతియుత వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తానని ఎస్సై కుమారస్వామి వెల్లడించారు.

బయట డాక్టర్ల బోర్డులు.. లోపల నకిలీ వైద్యం!

- హనుమకొండలో మూడు క్లినిక్‌లలో అక్రమాలు.. టీజీఎంసీ ఆకస్మిక తనిఖీల్లో వెలుగులోకి
- ఇంటర్ కూడా పూర్తి చేయని వ్యక్తితో చికిత్సలు.. నిర్వాహకులపై కేసులకు సిద్ధం



హనుమకొండ, జోర్దార్ ప్రతినిధి:వైద్యం పేరుతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న నకిలీ వైద్యుల వ్యవహారం హనుమకొండలో వెలుగుచూసింది. క్లినిక్‌ల బయట అర్హత కలిగిన వైద్యుల పేర్లు, వైద్య నమోదు సంఖ్యలు ప్రదర్శిస్తూ లోపల అర్హత లేని వ్యక్తులతో చికిత్సలు అందిస్తున్నట్లు తెలంగాణ వైద్య మండలి (టీజీఎంసీ) ఆకస్మిక తనిఖీల్లో గుర్తించింది. రెడ్డి కాలనీ, రాయపుర, ఇందిరా నగర్ ప్రాంతాల్లో మూడు క్లినిక్‌లను తనిఖీ చేయగా విస్తుపోయే విషయాలు బయటపడ్డాయి. ఇందిరానగర్‌లోని శ్రీలక్ష్మి క్లినిక్‌లో ఆర్.కె. రావు అనే వ్యక్తి రోగులకు చికిత్సలు అందిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. అతడిని హైదరాబాద్ నుంచి వచ్చిన వైద్యుడిగా పరిచయం చేస్తున్నారని, విచారణలో ఇంటర్మీడియట్ కూడా పూర్తి చేయలేదని, గతంలో ఓ వైద్యుడి వద్ద సహాయకుడిగా పనిచేసినట్లు సమాచారం. క్లినిక్ బోర్డుపై డా. బి. మోహనకృష్ణ, డా. ఎన్. అవినాష్ పేర్లు, వైద్య నమోదు సంఖ్యలు ప్రదర్శించినప్పటికీ, ఈ కేంద్రానికి వైద్య ఆరోగ్యశాఖ అనుమతి లేదని అధికారులు గుర్తించారు.

ప్రణతి క్లినిక్‌లో డా. కె. సుష్మిత పేరుతో ఉన్న అనుమతి గడువు ముగిసినట్లు, ఫార్మసీ విద్యను అభ్యసించిన ఎన్. సందీప్ వైద్యుడిగా పరిచయం చేసుకుంటూ చికిత్సలు అందిస్తున్నట్లు గుర్తించి ఆధారాలు సేకరించారు. మరోవైపు సిద్ధార్థ క్లినిక్ వ్యవహారంలో గతంలో కేసులు నమోదైనా అక్రమ వైద్య కార్యకలాపాలు కొనసాగుతున్నట్లు టీజీఎంసీ పేర్కొంది. తాజాగా నిర్వహించిన తనిఖీల్లో అనుమతులు లేకుండా క్లినిక్‌లు నిర్వహించడంతో పాటు బ్లెరాయిడ్లు, నొప్పి నివారణ, యాంటీబయాటిక్ ఇంజెక్షన్లు అధిక మోతాదులో ఇస్తున్నట్లు గుర్తించింది.

ఈ వ్యవహారంలో డా. కె. సుష్మిత, డా. బి. మోహనకృష్ణ, డా. ఎన్. అవినాష్‌లకు వివరణ కోరుతూ నోటీసులు జారీ చేయనున్నట్లు కౌన్సిల్ తెలిపింది. సంబంధిత నకిలీ వైద్యులపై తెలంగాణ వైద్య వృత్తిదారుల నమోదు చట్టం ప్రకారం హనుమకొండ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేయించనున్నట్లు వెల్లడించింది.

అర్హత లేని వ్యక్తుల వైద్యం వల్ల వ్యాధులు ముదిరి పోవడంతో పాటు విచక్షణారహితంగా మందులు, ఇంజెక్షన్లు వాడటం వల్ల మూత్రపిండాలు, ఇతర అవయవాలపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని హెచ్చరించింది. కొందరు నకిలీ వైద్యులు మధ్యవర్తుల ద్వారా రోగులను ప్రైవేటు ఆసుపత్రులకు పంపించి కమీషన్లు పొందుతున్నారనే ఫిర్యాదులు కూడా వస్తున్నాయని పేర్కొంది.

ప్రజలు క్లినిక్ బోర్డులు చూసి మోసపోకుండా చికిత్స అందిస్తున్న వైద్యుడి అర్హతలు, నమోదు వివరాలను నిర్ధారించుకోవాలని టీజీఎంసీ సూచించింది.

నకిలీ వైద్యులు, అనధికారిక క్లినిక్‌లపై ఫిర్యాదులను 91543 82727 నంబర్‌కు వాట్సాప్ ద్వారా పంపించాలని కోరింది.

తనిఖీల్లో టీజీఎంసీ సభ్యుడు డా. వి. నరేష్ కుమార్, కో-ఆప్టెడ్ సభ్యుడు డా. కొలిపాక వెంకట స్వామి, వరంగల్ జిల్లా యాంటీ క్వాకరీ కమిటీ చైర్మన్ డా. మహమ్మద్ అన్వర్ మియా, ఐఎంఏ కార్యదర్శి డా. ఎన్. శిరీష్ కుమార్ పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నకిలీ వైద్యులు, అనధికారిక క్లినిక్‌లపై తనిఖీలు కొనసాగిస్తామని కౌన్సిల్ స్పష్టం చేసింది.

గుర్రంకొండ చెర్లోపల్లిలో

తల్లి కోసం తనయుడి ప్రచారం

- ప్రజల్లో మంచి స్పందన



(అన్నమయ్య జోర్దార్ ప్రతినిధి)గుర్రంకొండ మండలం చెర్లోపల్లి గ్రామ సర్పంచ్ పదవికి పోటీ చేస్తున్న తన తల్లి దద్దాల రెడ్డి నలిని కోసం తనయుడు దద్దాల రెడ్డి ఆకాష్ చెర్లోపల్లికస్పాలో విస్తృత ప్రచారం చేయడం జరిగింది. ప్రజల్లో మంచి స్పందన లభించింది. గ్రామ ప్రజల కోసం గ్రామ అభివృద్ధి కోసం తన కుటుంబం చెర్లోపల్లిలోనే కాపురం ఉంటూ తన తాత స్వర్గీయ దద్దాల చలపతి నాయుడు, దద్దాల హరి ప్రసాద్ నాయుడు ప్రజలకు సేవ చేస్తూ ఉంటున్నారు, ప్రజల కోసం నా కుటుంబం ఎప్పుడు గ్రామంలోని కాపురం ఉండి గ్రామ ప్రజలసమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తాము. కాబట్టి మీరు నా కుటుంబాన్ని ఆదరించాలని మా అమ్మగారిని గెలిపించాలని కోరడం జరిగింది. మేము గెలిచినా ఊర్లోనే ఉంటాం సేవ చేస్తాం, ఓడిన ఊర్లోనే ఉంటాం సేవ చేస్తాం. మా మీద పోటీ చేస్తున్న వాళ్లు గెలిచిన మదనపల్లి, ఓడిన మదనపల్లిలోనే కాపురం ఉంటారు, అందుబాటులో ఉండరు, కావున మీరు ఆలోచించి ఓటు వేయాలని చెర్లపల్లి గ్రామ ప్రజలకు కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో.దద్దాల రెడ్డి ఆకాష్. దద్దాల హరి ప్రసాద్ నాయుడు. చెర్లోపల్లి గ్రామం ప్రజలు.మరియు. తదితరులుపాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రెడ్డిపల్లిలో

గ్రామ దేవతల శోభాయాత్ర



- మంగళహారతులు.. కోలాటాలు.. డప్పుచప్పుళ్లతో మార్మోగిన పల్లెలు

(వీణవంక జోర్దార్ ప్రతినిధి)వీణవంక మండలం రెడ్డిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని రెడ్డిపల్లి, అచ్చంపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో గ్రామ దేవతల పునఃప్రతిష్ఠ మహోత్సవాలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా భూ లక్ష్మి ,మహాలక్ష్మి, , బొడ్రాయి ఉత్సవ విగ్రహాలతో నిర్వహించిన శోభాయాత్ర గ్రామాల్లో పండుగ శోభను సంతరించుకుంది.

తొలిరోజు గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ శోభాయాత్ర ప్రారంభమైంది. మహిళలు మంగళహారతులు, నీటి బిందెలతో స్వాగతం పలుకగా, కోలాటాలు, డప్పుచప్పుళ్ల మధ్య గ్రామ వీధులన్నీ భక్తి పారవశ్యంతో మార్మోగాయి. నాలుగు రోజులపాటు జరగనున్న ఈ మహోత్సవాలతో గ్రామాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కర్ర విజయ-భగవాన్ రెడ్డి, ఉప సర్పంచ్ ఉయ్యాల రాణి-రాజు, మాజీ సర్పంచులు పోతుల నరసయ్య, అడిగొప్పుల సత్యనారాయణ, పోతుల కొండయ్య, మాజీ ఎంపీటీసీ వడ్డేపల్లి లక్ష్మి-భూమయ్య, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఉయ్యాల నాగరాజు, వార్డు సభ్యులు బండి మహేష్, నాయకులు సురేష్, శ్రీనివాస్, సుమన్, హరీష్, అనిల్, వెంకన్నతో పాటు అన్ని పార్టీల నాయకులు, మూడు గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పద్మశాలి సి డబ్ల్యూ సి కి "మాచన"



తెలంగాణ పద్మశాలి ఉద్యోగ సంఘం (టిపోపా) నాయకుడు, టుబాకో కంట్రోల్ హీరో అవార్డు గ్రహీత మాచన రఘునందన్ అఖిల భారత పద్మశాలి సంఘం లో కీలక బాధ్యతలు చేపట్టారు.సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామి ఈ మేరకు.."గో.. ఎహెడ్ మాచన" అన్నారు. శుక్రవారం నాడు పద్మశాలి భవన్ రఘునందన్ మాట్లాడుతూ..పద్మశాలి ఉద్యోగుల ఐక్యత, విద్యార్థుల ప్రోత్సాహం కోసం దశాబ్ద కాలం పైగా కృషి చేస్తున్నట్టు వివరించారు.వ్యక్తిత్వ వికాస నిపుణుడుగానే గాక..సమాజ హితైషి గా..రఘునందన్ పేరు తెచ్చుకున్నారు. ప్రతిభ ఉన్న పేద పద్మశాలి విద్యార్థులకు రఘునందన్ తానకు చేతనైన సాయం చేయడమే గాక చేనేత రంగ ప్రోత్సాహకుడిగా గుర్తింపు పొందారు

గుర్రంకొండ జడ్పిటిసి, ఎంపీటీసీ విజేతలకు

జనసేన, కూటమి నాయకుల ఘన సన్మానం



అన్నమయ్య జిల్లా జోర్దార్ ప్రతినిధి:గుర్రంకొండ: మండలంలోని జడ్పిటిసి, ఎంపీటీసీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన అభ్యర్థులకు జనసేన మరియు కూటమి కార్యకర్తలు ఘనంగా సన్మానం చేశారు.ఈ సందర్భంగా విజేతలు ఎజాజ్ అహ్మద్, నాయిని జగదీష్ లను గుర్రంకొండ జనసేన మరియు కూటమి నాయకులు కోల్ కోల్ విజయ్ కుమార్, బాలాజీ, భాస్కర, ఇర్షాద్ కలిసి శాలువాలతో కప్పి, పూలమాలలు వేసి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ... ప్రజల ఆశీస్సులతో సాధించిన ఈ విజయం కూటమి ఐక్యతకు నిదర్శనమని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మండల అభివృద్ధికి విజేతలు కృషి చేయాలని ఆకాంక్షించారు. స్థానిక కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు.

వీణవంకలో ప్రభుత్వ పాలిటెక్నిక్

కళాశాల ఏర్పాటు చేయాలి

- ఎమ్మెల్సీ బాల్మూరి వెంకట్‌కు వినతిపత్రం అందజేసిన పత్తి వేణుగోపాల్ రెడ్డి



(వీణవంక, జోర్దార్ ప్రతినిధి)వీణవంక మండల కేంద్రంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేయాలని కోరుతూ సామాజిక కార్యకర్త పత్తి వేణుగోపాల్ రెడ్డి ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ బాల్మూరి వెంకట్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సాంకేతిక విద్యను చేరువ చేయడంతో పాటు మండల విద్యా, ఆర్థిక అభివృద్ధికి ఈ కళాశాల ఎంతగానో దోహదపడుతుందని వివరించారు.

ఈ ప్రతిపాదనను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి కళాశాల మంజూరుకు కృషి చేయాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్సీ బాల్మూరి వెంకట్ త్వరలో ముఖ్యమంత్రిని కలిసి వీణవంకలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు ఆవశ్యకతను వివరిస్తానని హామీ ఇచ్చారు.

దుబ్బ మల్లన్న కళ్యాణ,జాతర పోస్టర్‌ను

ఆవిష్కరించిన వొడితల ప్రణవ్



(జమ్మికుంట జోర్దార్ ప్రతినిధి)జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని శ్రీ దుబ్బ మల్లికార్జున స్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్.ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు.అనంతరం ఆలయంలో వచ్చే నెల నుండి జరిగే మల్లికార్జున స్వామి కళ్యాణం,జాతరకు సంబంధించి పోస్టర్ ను ప్రణవ్ ఆవిష్కరించారు.ఎంతో మహిమ కలిగిన ఈ ఆలయంలో జరిగే జాతరకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని,జాతరకు సంబంధించి అన్ని ఏర్పాట్లను చేయాలని కమిటీని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో దుబ్బ మల్లన్న చైర్మెన్ రవీందర్,కౌన్సిలర్లు,కమిటీ సభ్యులు,ఆలయ అర్చకులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంను ప్రారంభించిన

ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి



- అనంతరం ఇందిరమ్మ గృహప్రవేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే

(వీణవంక జోర్దార్ ప్రతినిధి)వీణవంక మండల కేంద్రంలోని కొండ్ల పవన్--కావ్య దంపతులు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ వేడుకకు ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కుటుంబ సభ్యులతో కలిసి రిబ్బన్ కట్ చేసి గృహప్రవేశం చేశారు.

అనంతరం వీణవంకలో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దాసారపు సరోజన--రాజేంద్రప్రసాద్, మాజీ వైస్ ఎంపీపీ లతా శ్రీనివాస్, మాజీ సర్పంచ్ నీల కుమారస్వామి గ్రామ పాలకవర్గ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు, ఐకేపీ అధికారులు, కొనుగోలు కేంద్రం సభ్యులు, మహిళా సంఘాల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

నేర రహిత సమాజ నిర్మాణానికి

ప్రతి పోలీసు అధికారి కృషి చేయాలి

- ఎస్పీ



ఆదిలాబాద్,జోర్దార్ ప్రతినిధి:నేర రహిత సమాజ నిర్మాణానికి ప్రతి పోలీసు అధికారి అంకితభావంతో పనిచేయాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. శుక్రవారం జిల్లా పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా అరికట్టేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే బాధితుల సమస్యలను వేగంగా పరిష్కరించి, వారికి న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో ఏఎస్పీలు మౌనిక, రిత్విక్ సాయి పాల్గొన్నారు.

ముంపు బాధితులకు పరిహారం అందించడంపై హర్షం



కూనవరం,ఏపీ స్టేట్ జోర్దార్ బ్యూరో చింతూరు: కూనవరం మండలంలోని ముంపు ప్రభావిత గ్రామాల నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ పరిహారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టడంపై బీజేపీ గిరిజన మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు కుంజా చంద్రయ్య హర్షం వ్యక్తం చేశారు.

45 కాంటూరు పరిధిలోని చిన్నర్కూర్, వెంకన్నగూడెం, శ్రీరాం పురం గ్రామాల నిర్వాసితులకు పోలవరం పరిహారం అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఇంకా పరిహారం అందని అర్హులైన నిర్వాసితులకు నిబంధనల ప్రకారం పరిహారం మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

నిర్వాసితుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారికి న్యాయం జరిగేలా కృషి చేస్తానని చంద్రయ్య పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను

ప్రారంభించిన ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి




- రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

వికారాబాద్,జోర్దార్ ప్రతినిధి:యాలాల్ మండలం జుంటుపల్లి గ్రామంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో, అగ్గనూరు గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తాండూరు ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన క్వింటాలుకు రూ. 2,461 మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. రైతులు ఈ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా, సజావుగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

పల్లెల్లో పాలన గాడి తప్పుతోందా?

- అధికారుల పర్యవేక్షణ ఎక్కడ? ప్రజాధనం వినియోగంపై జవాబుదారీతనం ఏది?
- గ్రామాల్లో సమస్యలు పేరుకుపోతున్నా పట్టించుకునేదెవరు?
- ప్రభుత్వ భూముల పరిరక్షణ నుంచి అభివృద్ధి పనుల వరకు ఎన్నో ప్రశ్నలు!
- క్షేత్రస్థాయి తనిఖీలు, జిల్లా అధికారుల సమీక్షలపై ప్రజల్లో చర్చ



మంథని, జోర్దార్ ప్రత్యేక కథనం:గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయిస్తోంది. గ్రామపంచాయతీలకు పాలనా బాధ్యతలు అప్పగిస్తోంది. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశాలు జారీ చేస్తోంది. కానీ క్షేత్రస్థాయిలో ఆ ఆదేశాలు ఎంతవరకు అమలవుతున్నాయి? గ్రామపంచాయతీల్లో పరిపాలన ఎలా సాగుతోంది? ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు క్షేత్రస్థాయిలో ఏ మేరకు పర్యటిస్తున్నారు? అనే ప్రశ్నలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారుతున్నాయి. గ్రామాల అభివృద్ధి కేవలం కాగితాలకే పరిమితమవుతోందా? లేక ప్రజలకు నిజంగానే ఫలితాలు అందుతున్నాయా? అన్నది పరిశీలించాల్సిన అవసరం ఉంది.

అధికారుల పర్యవేక్షణ కాగితాలకే పరిమితమా?

గ్రామపంచాయతీల పనితీరును పర్యవేక్షించాల్సిన ఎంపీడీవోలు, డీపీవోలు, డీఎల్పీవోలు క్షేత్రస్థాయిలో ఎంత చురుగ్గా వ్యవహరిస్తున్నారన్నది కీలక ప్రశ్నగా మారింది. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల నాణ్యత, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, పారిశుద్ధ్య కార్మికుల పనితీరు, పంచాయతీ నిధుల వినియోగం వంటి అంశాలను అధికారులు నిరంతరం పరిశీలించాల్సి ఉంటుంది. అయితే గత ఏడు నెలల్లో అధికారులు ఎన్ని గ్రామాల్లో పర్యటించారు? ఎన్ని తనిఖీలు నిర్వహించారు? తనిఖీల్లో గుర్తించిన లోపాలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అనే వివరాలు ప్రజలకు తెలియాల్సి ఉంది. పర్యవేక్షణ బాధ్యతలు ఉన్నతాధికారులకే పరిమితమై, క్షేత్రస్థాయిలో ఫలితాలు కనిపించకపోతే గ్రామపాలనపై ప్రజలకు నమ్మకం ఎలా కలుగుతుందన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

ప్రజాధనం ఖర్చవుతోంది.. ఫలితాలు ఎక్కడ?

గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వ నిధులు విడుదలవుతున్నాయి. రహదారులు, మురుగునీటి కాలువలు, తాగునీటి వసతులు, పారిశుద్ధ్యం, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు వెచ్చిస్తున్నారు. అయితే చేపట్టిన పనులు నాణ్యతతో పూర్తవుతున్నాయా? అంచనాల ప్రకారం పనులు జరుగుతున్నాయా? ఖర్చు చేసిన ప్రతి రూపాయికి తగిన ప్రయోజనం ప్రజలకు అందుతోందా? అన్నది అధికారులు పరిశీలించాలి. పనులు పూర్తయినట్లు రికార్డుల్లో చూపించినా క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంటే బాధ్యత ఎవరిది? ప్రజాధనం వినియోగంలో పారదర్శకత, జవాబుదారీతనం తప్పనిసరిగా ఉండాలి.

ప్రభుత్వ భూములపై కన్ను.. కాపాడేదెవరు?

గ్రామాల్లో ప్రభుత్వ భూములు, గుట్టలు, ప్రజా అవసరాల కోసం కేటాయించిన స్థలాల పరిరక్షణ మరో కీలక అంశం. పాఠశాలలు, వైద్య కేంద్రాలు, పార్కులు, క్రీడా మైదానాలు, ఇతర ప్రజా అవసరాలకు భవిష్యత్తులో ఈ భూములు ఎంతో ఉపయోగపడతాయి. అలాంటి స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నాయనే ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలి. ప్రభుత్వ భూములను గుర్తించి హద్దులు నిర్ణయించడంతో పాటు ఆక్రమణలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలి. ఇప్పటికే ఆక్రమణలు జరిగితే వాటిని గుర్తించి చట్టప్రకారం పరిష్కరించాలి. ప్రజా అవసరాల కోసం ఉన్న భూములు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లకుండా కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

జిల్లా యంత్రాంగం సమీక్షించాలి!

గ్రామపంచాయతీల పనితీరుపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఎంపీడీవోలు, డీపీవోలు, డీఎల్పీవోలు నిర్వహించిన పర్యటనలు, తనిఖీల వివరాలను తెప్పించుకుని సమీక్షించాలి. గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న సమస్యలు, అసంపూర్తి అభివృద్ధి పనులు, ప్రభుత్వ భూముల ఆక్రమణ ఆరోపణలు, నిధుల వినియోగంపై సమగ్ర నివేదికలు కోరాలి. కేవలం కార్యాలయాల్లో కూర్చొని నివేదికలు పరిశీలించడం కాకుండా, ఆకస్మికంగా గ్రామాలను సందర్శించి వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాలి. విధుల్లో నిర్లక్ష్యం వహించే అధికారులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి.

ప్రజలకు సమాధానం చెప్పాల్సిందే!

గ్రామపంచాయతీ అనేది ప్రజలకు అత్యంత దగ్గరగా ఉండే పాలనా వ్యవస్థ. అక్కడ జరిగే ప్రతి పని ప్రజల జీవితాలపై ప్రభావం చూపుతుంది. అందుకే గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులు, ఖర్చు చేసిన నిధులు, అధికారుల పర్యటనలు, తనిఖీల వివరాలు ప్రజలకు అందుబాటులో ఉండాలి. సమస్యలపై ఫిర్యాదు చేసినప్పుడు వాటిని పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులదే.

గ్రామాల అభివృద్ధి పేరుతో నిధులు ఖర్చవుతున్నప్పుడు వాటి ఫలితాలు ప్రజలకు కనిపించాలి.

ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం గ్రామపంచాయతీలపై ప్రత్యేక నిఘా పెట్టి, క్షేత్రస్థాయి పర్యవేక్షణను బలోపేతం చేస్తుందా?

లేక పల్లె పాలనలో లోపాలు ఇలాగే కొనసాగుతాయా? అన్నది వేచి చూడాలి.

సింగరేణి ఉద్యోగం కోల్పోయిన బాధతోనా?

చెట్టుకు ఉరివేసుకొని కార్మికుడి మృతి!



రామగిరి,(జోర్దార్):పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం రత్నాపూర్ గ్రామంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. గ్రామంలోని ఎల్లమ్మ ఆలయం సమీపంలో సింగరేణి కార్మికుడు సల్పాల తిరుపతి చెట్టుకు ఉరివేసుకొని మృతి చెందినట్లు సమాచారం.రత్నాపూర్‌కు చెందిన సల్పాల సాయవ్వ--ఐలయ్య దంపతుల రెండో కుమారుడైన తిరుపతి సింగరేణిలో ఉద్యోగం కోల్పోయిన బాధతోనే ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడా? అనే చర్చ స్థానికంగా జరుగుతోంది. అయితే మృతికి గల అసలు కారణాలు ఇంకా అధికారికంగా వెల్లడికా లేదు.సింగరేణి ఉద్యోగం కోల్పోవడం వెనుక ఉన్న పరిస్థితులు, కుటుంబ సమస్యలు లేదా ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అన్నది తెలియాల్సి ఉంది.

ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, పోలీసుల విచారణ అనంతరం వెల్లడికానున్నాయి.

విలీన మండలాల్లో శాశ్వత

మేజిస్ట్రేట్ కోర్టు ఏర్పాటు చేయాలి



- చింతూరు లేదా ఎటపాకలో కోర్టు మంజూరు చేయాలని హైకోర్టు న్యాయమూర్తులకు న్యాయవాదుల వినతి

ఏపీ స్టేట్ జోర్దార్ బ్యూరో:పోలవరం జిల్లాలోని విలీన మండలాలైన చింతూరు, ఎటపాక, కూనవరం, వి.ఆర్.పురం ప్రజలకు సత్వర న్యాయం అందించేందుకు చింతూరు రెవెన్యూ డివిజన్ కేంద్రంలో లేదా ఎటపాక మండల కేంద్రంలో పూర్తిస్థాయి రెగ్యులర్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టును శాశ్వతంగా ఏర్పాటు చేయాలని విలీన మండలాల న్యాయవాదుల సంఘం ప్రతినిధులు కోరారు.ఈ మేరకు శుక్రవారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎన్. హరినాథ్, జస్టిస్ బట్టు దేవానంద్‌తో పాటు రాష్ట్ర అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్‌కు వినతిపత్రాలు సమర్పించారు.

నాలుగు విలీన మండలాల్లో స్థానికంగా శాశ్వత కోర్టు లేకపోవడంతో ప్రజలు, గిరిజన కక్షిదారులు, సాక్షులు, న్యాయవాదులు కోర్టు విచారణల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. దీనివల్ల ప్రయాణ ఖర్చులతో పాటు రోజువారీ కూలీ పనులు కోల్పోయి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. స్థానికంగా కోర్టు లేకపోవడంతో కేసుల విచారణలోనూ జాప్యం జరుగుతోందని వివరించారు.

నాలుగు మండలాలకు రవాణా సౌకర్యం ఉన్న చింతూరు లేదా ఎటపాకలో శాశ్వత మేజిస్ట్రేట్ కోర్టును మంజూరు చేసి గిరిజనుల గడప వద్దకే న్యాయసేవలు అందించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొడాలి శ్రీనివాసన్, ప్రధాన కార్యదర్శి పూసాల శ్రీనివాసాచారి, విలీన మండలాల న్యాయవాదుల సంఘం సభ్యులు పేరాల నాగరాజు, పామరాజు తిరుమలరావు, వలవల సురేష్ కుమార్, కొత్తపల్లి రాంబాబు, విజ్జగిరి రవితేజ, సున్నం వెంకటరమణ, మోసం సంజీవరావు తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన

పోలీస్ సేవలు అందించాలి

- ఐనవోలు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన సీపీ.. రికార్డుల పరిశీలన, సిబ్బందికి పలు సూచనలు



వరంగల్,జోర్దార్ ప్రతినిధి:ఐనవోలు పోలీస్ స్టేషన్‌ను పోలీస్ కమిషనర్ (సీపీ) సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు పూల మొక్కలు అందించి స్వాగతం పలుకగా, సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. అనంతరం స్టేషన్ ఆవరణలో సీపీ కొబ్బరి మొక్కను నాటారు.తదుపరి పోలీస్ స్టేషన్‌లోని వివిధ రికార్డులు, కేసుల వివరాలు, నిర్వహణ రిజిస్టర్లను పరిశీలించి సిబ్బంది విధులు, బాధ్యతలు, పనితీరుపై ఆరా తీశారు. ప్రజల ఫిర్యాదులపై తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా విధులు నిర్వహించాలని, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించాలని సూచించారు.

ఐనవోలులో ప్రసిద్ధ మల్లికార్జున స్వామి ఆలయం ఉన్నందున దర్శనానికి వచ్చే భక్తుల మనోభావాలు, ఆచార సంప్రదాయాలను గౌరవిస్తూ వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని తెలిపారు. పోలీస్ శాఖ ప్రతిష్టను కాపాడుతూ భక్తులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. సిబ్బంది ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ ప్రతిరోజూ వ్యాయామం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, మామునూరు ఏసీపీ వెంకటేష్, పర్వతగిరి సీఐ సంతోష్, ఐనవోలు ఎస్ఐ అశోక్, సంగెం ఎస్ఐ వంశీకృష్ణ, పర్వతగిరి ఎస్ఐ రాజ్ కుమార్, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

లబ్ధిదారుల కళ్లల్లో ఆనందం చూడడమే

కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం



- ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశానికి హాజరైన పొడితల ప్రణవ్
- కాంగ్రెస్ ఇచ్చిన ఇంటికి కౌశిక్ రెడ్డి రిబ్బన్ కట్ చేయడంపై ఆసక్తికర వ్యాఖ్యలు
- పదేళ్లలో ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదు.. ఇప్పుడు రెండు విడతల్లో మరిన్ని ఇళ్లు మంజూరు చేస్తాం

(వీణవంక జోర్దార్ ప్రతినిధి)పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ అన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేసి, వారి జీవితాల్లో ఆనందం నింపుతున్నామని పేర్కొన్నారు.

శుక్రవారం వీణవంక మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుడి నూతన గృహప్రవేశ కార్యక్రమానికి ప్రణవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ.. గత 30 ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్న తమ కలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చిందని ఆనందం వ్యక్తం చేశారు. వొడితల ప్రణవ్ చొరవతో ఇందిరమ్మ ఇల్లు మంజూరైందని, ప్రభుత్వం అందించిన ఆర్థిక భరోసాతో కొత్త ఇంటిలోకి అడుగుపెడుతున్నామని సంతోషం వెలిబుచ్చారు.

కౌశిక్ రెడ్డికి ప్రణవ్ చురకలు

అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఎక్కడున్నాయని ప్రశ్నించే కౌశిక్ రెడ్డి, అదే కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇంటికి రిబ్బన్ కట్ చేయడం ఆసక్తికరమన్నారు. ఇంటి గృహప్రవేశం సందర్భంగా లబ్ధిదారుల కళ్లల్లో కనిపిస్తున్న ఆనందాన్ని ఆయన గమనించాలని వ్యాఖ్యానించారు.గత పదేళ్ల పాలనలో హుజూరాబాద్ నియోజక వర్గంలో ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయకుండా లబ్ధిదారులను మభ్యపెట్టారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి విడతతో పాటు రెండో విడతలోనూ మరిన్ని ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి పేదలను ఆదుకుంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, మైనారిటీ నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తది తరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కూనంనేనికి

కార్పొరేటర్ మునిగడప పద్మ వినతి



రుద్రంపూర్ : సింగరేణి పెన్షన్స్ రూ.2 వేల లోపు వస్తే ఆసరా పెన్షన్‌కి అనుమతించాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకి 16వ డివిజన్ కార్పొరేటర్ మునిగడప పద్మ, సిపిఐ కార్పొరేటర్స్, గిరిజన సంఘం నాయకులతో కలిసి వినతి పత్రాన్ని అందించారు. శుక్రవారం స్థానిక కొత్తగూడెం క్లబ్‌లో జరిగిన ఆసరా పెన్షన్ కార్యక్రమంలో ఎమ్మెల్యేకి వినతిపత్రం అందించిన కార్పొరేటర్ మునిగడప పద్మ కరెంటు బిల్లు, నాలుగు చక్రాల వాహనం తదితర చిన్న చిన్న సాంకేతిక లోపంతో 360 డిగ్రీల పేరుతో ప్రొసీడింగ్స్ ఇవ్వకుండా ఆపిన లబ్ధిదారులకు కూడా ప్రొసీడింగ్స్ ఇచ్చి పెన్షన్స్ మంజూరు చేయాలని కోరారు. గత ఐదారు సంవత్సరాల క్రితం లబ్ధిదారులు బ్యాంకులో లోన్ ద్వారా కార్లు కొనుగోలు చేసి టాక్సీ నడుపుకున్న వారు ఆర్థిక పరిస్థితి బాగాలేక విక్రయించిన వారి కుమారులు లేదా భర్తల పేర్లు ఆన్‌లైన్‌లో 360 డిగ్రీలలో చూపెడుతున్నాయని ఆ లబ్ధిదారుల పేర్లను కూడా ఆపివే యడం జరిగిందని ఎమ్మెల్యేకు వివరించారు.

స్థానికంగా చుట్టుపక్కల వారిని విచారించి వారికి నాలుగు చక్రాల వాహనం లేదని తెలితే వారికి కూడా పెన్షన్స్ మంజూరు చేయాలని ఎమ్మెల్యేకి విన్నవించారు. ఎమ్మెల్యే అధికారుల దృష్టికి తీసుకెళ్లి అనంతరం సంబంధిత అధికారులు రూ.2 వేల లోపు సింగరేణి పెన్షన్ ఉంటే చేయూత పెన్షన్‌కు అనుమతిస్తామని సభాముఖంగా హామీ ఇచ్చారని ఆమె తెలిపారు. చిన్న చిన్న సాంకేతిక కారణాలతో ఆగిన పెన్షన్లపై కూడా మరోసారి పునర్ పరిశీలన చేసి న్యాయం చేస్తామని అధికారులు తెలిపారన్నారు. అనంతరం 16వ డివిజన్‌లో 44 మంది లబ్ధిదారులకు చేయూత పెన్షన్లు మంజూరు అయినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, మేయర్ మూడ్ గణేష్ చేతుల మీదుగా పెన్షన్ల మంజూరు పత్రాల పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గిరిజన సంఘం ప్రధాన కార్యదర్శి భూక్య శ్రీనివాస్, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మునిగడప వెంకటేశ్వర్లు, కార్పొరేటర్స్ బండి నరసింహా, బోయిన విజయ్, సుధాకర్ రాజు,ఎర్రబెల్లి శంకర్, సహారా బేగం, పోలమూరు ధనలక్ష్మి, దర్గయ్య, శాంతి ప్రియ, కంచర్ల హిమాశ్రీ, కళావతి, ఆకాంక్ష, నాగలక్ష్మి, హరిత పాల్గొన్నారు

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఉద్భవించిందే

ఐజేయు, టీయూ డబ్ల్యూజే



- 75 సంవత్సరాల చరిత్ర కలిగిన సంఘానికి మరేది ధీటుగా రాదు.
- రాష్ట్ర టి యు డబ్ల్యూ జే ఉపాధ్యక్షులు విరాహత్ అలీ.

మంచిర్యాల జోర్దార్ జిల్లా ప్రతినిధి:జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఉద్భవించింది ఐజేయు, టియుబ్ల్యూజే యూనియన్లని, రాష్ట్ర ఉపాధ్యక్షులు విరాహత్ అలీ అన్నారు.

శుక్రవారం మంచిర్యాల పట్టణంలోని ఎం కన్వెన్షన్ హాల్లో జిల్లా నాయకులు దేగ సత్యం అధ్యక్షతన ఏర్పాటు చేసిన జిల్లా తృతీయ మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు, రాష్ట్రంలోని జర్నలిస్టుల హక్కుల సాధన కోసం, సమస్యల పరిష్కారం కోసం, ప్రభుత్వాలతో, పత్రికా యాజమాన్యాలతో, చట్టబద్ధంగా పోరాటాలు చేస్తూ హక్కులను సాధిస్తున్న ఏకైక సంఘం టియుడబ్ల్యూజే అని, అందుకే ఇప్పటివరకు ఏ సంఘానికి లేని ఆదరణ టియుడబ్ల్యూజే కు ఉందని అన్నారు.నిస్వార్థంగా ఎలాంటి వేతనాలు, లేకుండా పనిచేస్తున్న గ్రామీణ ప్రాంతాల జర్నలిస్టులకు ప్రభుత్వం ద్వారా కనీసం ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్ రూములు, అనారోగ్యాల బారిన పడితే హెల్త్ కార్డుల ద్వారా చికిత్స పొందేందుకు, అర్హులైన వారికి పెన్షన్లు ఇచ్చి ఆదుకునేందుకు ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేస్తున్నామని అన్నారు. శాంతియుతంగా సమస్యలు పరిష్కారం కాకపోతే, ఉద్యమాలతోనే పరిష్కారం అవుతాయని, శాంతియుతంగా పరిష్కారం కాకపోతే, ఉద్యమాలు చేయక తప్పదని, ఉద్యమాలు చేయడానికి సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.

యూనియన్ ఆహ్వానం మేరకు స్థానిక జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపీ ఎగ్గడి భాస్కర్, జర్నలిస్టులు చేయాల్సిన వి, ఉండాల్సిన క్రమశిక్షణను, వార్తలు రాసే విధానాలను వివరించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రాంనారాయణ, రాష్ట్ర నాయకులు ప్రకాష్ రెడ్డి, జిల్లా స్థాయి నాయకులు, జిల్లా స్థాయిలో పనిచేస్తున్న 200 కు పైగా జర్నలిస్టులు హాజరయ్యారు.

అనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడానికి ఎన్నికలు నిర్వహించారు.

అనారోగ్య సమస్యలతో యువకుడి మృతి



జమ్మికుంట, జోర్దార్ ప్రతినిధి:జమ్మికుంట పట్టణంలోని జైభీమ్ కాలనీలో ఓ యువకుడు అనారోగ్య సమస్యలతో మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. 16వ వార్డుకు చెందిన పుల్లూరి రాధమ్మ రెండో కుమారుడు శ్యామూర్తి (34) ఈ నెల 10న పని ముగించుకుని ఇంటికి వచ్చాడు. అనంతరం అస్వస్థతకు గురైనట్లు కుటుంబ సభ్యులకు తెలిపాడు. వెంటనే అతడిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి, అక్కడి నుంచి హనుమకొండలోని ఓజస్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. తన కుమారుడు కొంతకాలంగా అల్సర్ నొప్పితో బాధపడుతున్నాడని, ఆ బాధతోనే ఈ నిర్ణయం తీసుకున్నాడని తల్లి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లా సమన్వయ కమిటీ సభ్యునిగా డా. కొర్ర కిషన్ నాయక్

- సమాచార హక్కు చట్టం అమలుపై పర్యవేక్షణకు నియామకం
- ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకతకు కృషి చేస్తా..



(నల్గొండ జోర్దార్ ప్రతినిధి)సమాచార హక్కు చట్టం అమలును మరింత పకడ్బందీగా పర్యవేక్షించేందుకు నల్గొండ జిల్లాలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సభ్యునిగా సమాచార హక్కు కార్యకర్తల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డా. కొర్ర కిషన్ నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ బి. చంద్ర శేఖర్ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు.

వివిధ రెవెన్యూ విభాగాల అధికారుల ప్రతిపాదనలను పరిశీలించిన అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి ప్రొసీడింగ్స్ నంబరు ఏ5/11318/2016-2026 ద్వారా డా. కొర్ర కిషన్ నాయక్‌ను కమిటీ సభ్యునిగా నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ నియామకంపై పలువురు ప్రజాప్రతినిధులు, కులసంఘాల నాయకులు, సమాచార హక్కు కార్యకర్తల సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

చట్టం అమలులో పారదర్శకత తప్పనిసరి

ఈ సందర్భంగా డా. కొర్ర కిషన్ నాయక్ మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టం--2005ను ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో సమర్థవంతంగా అమలు చేయాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో సమాచార హక్కు చట్టానికి సంబంధించిన వివరాలతో కూడిన సూచిక బోర్డులను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని కోరారు.

ముఖ్యంగా చట్టంలోని 4(1)(బి) సెక్షన్ ప్రకారం ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు స్వచ్ఛందంగా అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యాలయాల నోటీసు బోర్డులతో పాటు ఇతర ప్రచార మాధ్యమాల ద్వారా కూడా ప్రభుత్వ శాఖల విధివిధానాలు, అధికారుల బాధ్యతలు, ప్రజలకు అందించే సేవలు, సంక్షేమ పథకాల వివరాలను వెల్లడించాలన్నారు.

ప్రజలకు సులభంగా సమాచారం అందాలి

సమాచారం కోసం ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదని, ప్రభుత్వ కార్యకలాపాల్లో పారదర్శకతకు అధికారులు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. సమాచార హక్కు చట్టంలోని నిబంధనలను కేవలం కాగితాలకే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయిలో అమలు చేయాలని కోరారు.

ప్రజల్లో సమాచార హక్కు చట్టంపై మరింత అవగాహన కల్పించడంతో పాటు, ప్రభుత్వ కార్యాలయాల్లో చట్టం అమలు తీరును పర్యవేక్షించేందుకు సమాచార హక్కు కార్యకర్తల సంఘం తరఫున నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. తనకు జిల్లా స్థాయి సమన్వయ కమిటీలో సభ్యునిగా అవకాశం కల్పించిన జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్‌కు డా. కొర్ర కిషన్ నాయక్ కృతజ్ఞతలు తెలిపారు.

బరువు తగ్గించే మందులను వైద్య సలహా లేకుండా వాడితే ప్రమాదం.. ఎందుకంటే..?



బరువు తగ్గించే ఇంజెక్షన్లు ఊబకాయం, టైప్-2 మధుమేహం చికిత్సలో కొత్త మార్పులు తీసుకొస్తున్నాయి. జీఎల్‌పీ-1 రిసెప్టర్ అగోనిస్టులు, డ్యుయల్ జీఐపీ, జీఎల్‌పీ-1 అగోనిస్టులు వంటి ఆధునిక ఔషధాలు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంతోపాటు ఆకలిని తగ్గించి, గణనీయంగా బరువు తగ్గేందుకు సహాయపడతాయి. ఎంపిక చేసిన రోగుల్లో గుండె, మూత్ర పిండాల సమస్యల ముప్పును కూడా తగ్గించవచ్చు. అయితే ఈ ఇంజెక్షన్లు అందరికీ సరిపోవు. వీటిని సూచించే ముందు వైద్యులు రోగి ఆరోగ్య పరిస్థితిని పూర్తిగా పరిశీలిస్తారు. కేవలం బరువు తగ్గాలనే కోరికతో ఈ మందులు వాడకూడదని, ప్రతి ఒక్కరి ఆరోగ్య అవసరాలను బట్టి చికిత్స నిర్ణయించాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఎవరు ఈ మందులను వాడకూడదు..?

రోగికి ఉన్న ఇతర ఆరోగ్య సమస్యలను కూడా వైద్యులు పరిగణనలోకి తీసుకుంటారు. ఊబకాయం వల్ల వచ్చే సమస్యలు, ఫ్యాటీ లివర్, గుండె జబ్బులు, దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధులు ఉన్నవారికి ఈ మందుల వల్ల అదనపు ప్రయోజనాలు కలుగుతాయి.

అయితే కొన్ని జీర్ణకోశ సమస్యలు, హార్మోన్ల సంబంధిత వ్యాధులు ఉన్నవారికి ఇవి సరిపోవు. రక్తపోటు, కొలెస్ట్రాల్, నడుము చుట్టుకొలత, ఇన్సులిన్ నిరోధకత, గుండె సంబంధిత ముప్పును కూడా అంచనా వేస్తారు. సన్నగా కనిపించినప్పటికీ అంతర్గతంగా అధిక కొవ్వు కలిగిన వారిలో బరువు కంటే జీవక్రియ ఆరోగ్యానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు.

బరువు తక్కువగా ఉన్నా టైప్ 2 డయాబెటిస్..

ముందుగా వ్యక్తి ఎత్తు, వయసుకు అనుగుణంగా బరువు, శరీర ద్రవ్యరాశి సూచీ (బీఎంఐ), శరీరంలో కొవ్వు పంపిణీని పరిశీలిస్తారు. భారతీయుల్లో కొందరికి బీఎంఐ సాధారణంగా ఉన్నప్పటికీ అంతర్గత అవయవాల చుట్టూ అధిక కొవ్వు పేరుకుపోయి టైప్-2 మధుమేహం వచ్చే అవకాశం ఉంటుంది. అందువల్ల బరువుతోపాటు శరీరంలో కొవ్వు స్థాయిలను కూడా అంచనా వేస్తారు. వయసును బట్టి చికిత్సను నిర్ణయిస్తారు. వృద్ధుల్లో అధిక బరువు తగ్గడం, కండరాలు క్షీణించడం, నీరసం, జీర్ణ సమస్యలు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. అలాగే మధుమేహం తీవ్రతను తెలుసుకునేందుకు హెచ్‌బీఏ1సీ, ఉపవాస రక్తంలో చక్కెర, భోజనం తర్వాత చక్కెర స్థాయిలు, వ్యాధి వ్యవధి, ప్రస్తుతం వాడుతున్న మందులను పరిశీలిస్తారు. జీవనశైలి మార్పులు, ట్యాబ్లెట్లను వాడినా చక్కెర నియంత్రణలో లేని వారికి ఈ ఇంజెక్షన్లు ఉపయోగపడతాయి. కొందరికి మెట్‌ఫార్మిన్ వంటి సాధారణ మందులే సరైన చికిత్సగా కొనసాగుతాయి.

జీవనశైలి కూడా ముఖ్యమే..

ఈ ఇంజెక్షన్లు మాత్రమే వాడితే బరువు తగ్గుతుందని భావించకూడదు. ఆరోగ్యకరమైన ఆహారం, తగినంత ప్రోటీన్, క్రమం తప్పని వ్యాయామం, నాణ్యమైన నిద్ర, జీవనశైలిలో మార్పులు తప్పనిసరి. చికిత్స సమయంలో వైద్యులను క్రమం తప్పకుండా సంప్రదించాలి. ఈ మందుల వల్ల వికారం, వాంతులు, మలబద్ధకం, విరేచనాలు, కడుపు ఉబ్బరం, కండరాల క్షీణత వంటి దుష్ప్రభావాలు కలుగుతాయి. అరుదుగా పిత్తాశయ సమస్యలు, క్లోమగ్రంథి వాపు, శరీరంలో నీరు తగ్గడం వంటి సమస్యలు కూడా తలెత్తుతాయి. ఇప్పటికే తక్కువ బరువు ఉన్నవారు లేదా తీవ్రమైన జీర్ణ సమస్యలు ఉన్నవారు వీటిని వాడకూడదని వైద్యులు సూచించే అవకాశం ఉంది. అందువల్ల వయసు, బీఎంఐ, మధుమేహ తీవ్రత, ఇతర అనారోగ్యాలు, జీవనశైలి, దుష్ప్రభావాల ముప్పును పరిశీలించిన తర్వాతే నిపుణుల పర్యవేక్షణలో ఈ ఇంజెక్షన్లు వాడాలి. సామాజిక మాధ్యమాల్లో చూసి సొంతంగా మందులు వాడడం ప్రమాదకరమని నిపుణులు తెలియజేస్తున్నారు

చిన్నతనంలో కొన్ని టీకాలు వేయించుకోని వారు పెద్దయ్యాక తీసుకోవచ్చా

వైద్య నిపుణులు ఏం చెబుతున్నారు..?



చిన్నతనంలో వేయించుకోవాల్సిన టీకాలు సమయానికి తీసుకోలేకపోయినంత మాత్రాన వ్యాధుల నుంచి రక్షణ పొందే అవకాశం పూర్తిగా కోల్పోయినట్లు కాదు. కొన్ని టీకాలను పెద్దయ్యాక కూడా తీసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. వయసు, గతంలో తీసుకున్న టీకాల వివరాలు, ఆరోగ్య పరిస్థితులను పరిశీలించిన తర్వాత వైద్యులు అవసరమైన టీకాలను సూచిస్తారు. చిన్నతనంలో అనారోగ్యం, అవగాహన లేకపోవడం, ఆర్థిక ఇబ్బందులు లేదా వైద్య సదుపాయాలు అందుబాటులో లేకపోవడం వంటి కారణాలతో కొందరు పిల్లలకు టీకాలు సకాలంలో అందవు. మరికొందరికి చిన్నతనంలో ఏయే టీకాలు వేయించారో సరైన రికార్డులు కూడా ఉండవు. అయితే దీనివల్ల జీవితాంతం ఆ వ్యాధుల నుంచి రక్షణ పొందలేమని భావించకూడదు.

తప్పిపోయిన టీకాలను తర్వాత వేయించుకునే విధానాన్ని క్యాచ్-అప్ వ్యాక్సినేషన్ అంటారు. వయసు పెరిగేకొద్దీ రోగనిరోధక శక్తి తగ్గడం, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు ఉండడం వల్ల పెద్దలకు కూడా కొన్ని ఇన్ఫెక్షన్ల ముప్పు ఎక్కువగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. వారు ఇన్ఫెక్షన్లకు గురైతే ఇంట్లోని పిల్లలు, వృద్ధులకు కూడా వ్యాధులు వ్యాపించే అవకాశం ఉంటుంది.

టీకాలకు పరిమితులు ఉంటాయా..

చిన్నతనంలో మిస్సైన ప్రతి టీకాను పెద్దయ్యాక తీసుకోవచ్చని మాత్రం అనుకోకూడదు. కొన్ని టీకాలకు వయోపరిమితులు ఉంటాయి. మరి కొన్ని నిర్దిష్ట ఆరోగ్య సమస్యలు లేదా ప్రమాద కారకాలు ఉన్నవారికే సిఫారసు చేస్తారు. హెపటైటిస్ బి టీకా కాలేయాన్ని ప్రభావితం చేసే వైరస్ నుంచి రక్షణ కల్పిస్తుంది. చిన్నతనంలో ఈ టీకా తీసుకోని వారు లేదా పూర్తి మోతాదులు తీసుకోని వారికి వైద్యులు సూచిస్తారు. హెపటైటిస్ ఎ టీకా కలుషితమైన ఆహారం, నీటి ద్వారా వ్యాపించే వైరస్ నుంచి రక్షణ ఇస్తుంది. గతంలో టీకా తీసుకోని వారు, రోగనిరోధక శక్తి లేని వారు, కొన్ని ఆరోగ్య సమస్యలు లేదా ఇతర ప్రమాద కారకాలు ఉన్నవారు దీన్ని తీసుకోవాల్సి వస్తుంది.

మీజిల్స్, గవదబిళ్లలు, రుబెల్లా వ్యాధుల నుంచి రక్షణ ఇచ్చే ఎంఎంఆర్ టీకా కూడా అవసరమైన పెద్దలకు సూచిస్తారు. ముఖ్యంగా వైద్య సిబ్బంది, ఈ వ్యాధులు సోకే అవకాశం ఎక్కువగా ఉన్నవారు తమ టీకాల వివరాలను పరిశీలించుకోవాలి.

గతంలో చికెన్‌పాక్స్ రాని, దానికి టీకా తీసుకోని పెద్దలకు వరిసెల్లా టీకా అవసరమవుతుంది. పిల్లలతో పోలిస్తే పెద్దలలో చికెన్‌పాక్స్ వల్ల కొన్నిసార్లు తీవ్రమైన సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది.

ఈ వ్యాధులకు అవసరమే..

ధనుర్వాతం, డిఫ్తీరియా, కోరింత దగ్గు నుంచి రక్షణ ఇచ్చే టీడాప్ టీకా కూడా ముఖ్యమైనదే. యుక్తవయసులో ఈ టీకా తీసుకోని పెద్దలకు ఒక మోతాదు అవసరమవుతుంది. ఆ తర్వాత వైద్యుల సూచన మేరకు ధనుర్వాతం, డిఫ్తీరియా నివారణకు బూస్టర్ మోతాదులు తీసుకోవాలి. గర్భిణులు ప్రతి గర్భధారణ సమయంలో టీడాప్ టీకా తీసుకోవాలని సూచిస్తారు. దీనివల్ల పుట్టబోయే బిడ్డకు కోరింత దగ్గు నుంచి రక్షణ లభిస్తుంది.

హెచ్‌పీవీ టీకా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌తోపాటు మరికొన్ని క్యాన్సర్లకు కారణమయ్యే వైరస్ రకాల నుంచి రక్షణ కల్పిస్తుంది. సాధారణంగా యుక్తవయసులో వేయించడం ఉత్తమమైనప్పటికీ, వయసు, గతంలో తీసుకున్న టీకాల వివరాల ఆధారంగా కొందరు పెద్దలకు కూడా ఇది ఉపయోగపడుతుంది.

ఇన్‌ఫ్లుయెంజా టీకాను ప్రతి సంవత్సరం తీసుకోవాలని కొన్ని వర్గాల పెద్దలకు సూచిస్తారు. ముఖ్యంగా వృద్ధులు, ఇతర అనారోగ్య సమస్యలు ఉన్నవారికి ఇది అవసరం అవుతుంది. న్యుమోకాకల్ టీకా న్యుమోనియా, మెదడు పొరల వాపు, రక్తంలో ఇన్ఫెక్షన్ల వంటి సమస్యల నుంచి రక్షణ కల్పిస్తుంది. వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులు లేదా బలహీనమైన రోగనిరోధక శక్తి ఉన్నవారికి దీన్ని సూచిస్తారు.

అలాగే చికెన్‌పాక్స్‌కు కారణమయ్యే వైరస్ మళ్లీ క్రియాశీలమై వచ్చే షింగిల్స్ నివారణకు కూడా టీకా అందుబాటులో ఉంది. వయసు పెరిగినవారికి, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న కొందరికి ఇది అవసరమవుతుంది.

ఎవరు తీసుకోకూడదు..?

దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు, రోగనిరోధక శక్తి బలహీనంగా ఉన్నవారు కొన్ని ఇన్ఫెక్షన్ల నుంచి అదనపు రక్షణ పొందాల్సి ఉంటుంది. కాలేయం, మూత్రపిండాలు, గుండె, ఊపిరితిత్తులకు సంబంధించిన సమస్యలు ఉన్నవారిలో ఇన్ఫెక్షన్లు తీవ్రమయ్యే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది.

అలాగే వైద్య సిబ్బంది వంటి వృత్తిపరంగా ఇన్ఫెక్షన్లకు గురయ్యే అవకాశం ఉన్నవారు కూడా తమ టీకాల వివరాలను వైద్యులతో సమీక్షించుకోవాలి. చిన్నతనంలో టీకాలు వేయించుకున్న రికార్డులు లేకపోయినా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ముందుగా వైద్యుడిని సంప్రదించి మీ వయసు, ఆరోగ్య పరిస్థితులు, గత టీకాల వివరాలను తెలియజేయాలి. ఇంట్లో ఉన్న టీకా కార్డులు, ఆసుపత్రి రికార్డులు, పాత వైద్య పత్రాలను పరిశీలించాలి. ఏ టీకాలు మిస్సయ్యాయో వైద్యుడిని అడిగి తెలుసుకోవాలి.

జాగ్రత్తలు తప్పనిసరి..

వైద్యులు సూచించిన మోతాదులు, వాటి మధ్య ఉండాల్సిన వ్యవధిని తప్పనిసరిగా పాటించాలి. భవిష్యత్తులో మోతాదులు మిస్సవకుండా టీకాల రికార్డులను భద్రపరచుకోవాలి. కొన్ని ప్రత్యక్ష టీకాలు గర్భధారణ సమయంలో లేదా నిర్దిష్ట రోగనిరోధక సమస్యలు ఉన్నవారికి సరిపడవు. అందువల్ల వైద్యుల సలహా లేకుండా టీకాలు వేయించుకోకూడదు. గతంలో తీసుకున్న మోతాదులను బట్టి వైద్యులు మిగిలిన టీకాలను సూచిస్తారు. సాధారణంగా ఒక మోతాదు మిస్సయిందని మొత్తం టీకాల ప్రక్రియను మొదటి నుంచి ప్రారంభించాల్సిన అవసరం ఉండదు. టీకాలు కేవలం పిల్లలకే కాదు.. పెద్దల ఆరోగ్య రక్షణలోనూ ముఖ్యమైన భాగం. మనల్ని మనం రక్షించుకోవడంతోపాటు మన కుటుంబ సభ్యులకు వ్యాధులు వ్యాపించకుండా చూడడానికి కూడా టీకాలు ఎంతో ఉపయోగపడతాయని వైద్యులు సూచిస్తున్నారు

హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులకు కొత్త ఔషధం ఏడాదికి రెండుసార్లు ఇంజెక్షన్ చాలు



ఉగాండాలోని పశ్చిమ ప్రాంతంలో ఉన్న బరారా నగరంలో హెచ్ఐవీ వ్యాప్తి ఆందోళన కలిగిస్తోంది. అక్కడి రెడ్‌లైట్ ప్రాంతంలో పనిచేసే ఓ మహిళ లైంగిక సంబంధాల సమయంలో కండోమ్‌లను తప్పనిసరిగా ఉపయోగించాలని కోరుతున్నప్పటికీ, కొంతమంది పురుషులు వాటిని తొలగించడానికి లేదా చింపేయడానికి ప్రయత్నిస్తున్నారు. హెచ్ఐవీ నివారణ కోసం ఆమె ప్రీఈపీ మందులు తీసుకుంటోంది. అయితే ఇప్పుడు లెనకాపావిర్ అనే కొత్త ఔషధంపై ఆశలు పెరుగుతున్నాయి. ఏడాదికి రెండుసార్లు మాత్రమే ఇంజెక్షన్ తీసుకోవడం ద్వారా హెచ్ఐవీ నుంచి దాదాపు సంపూర్ణ రక్షణ పొందవచ్చని అధ్యయనాలు వెల్లడించాయి. ఆరు నెలల పాటు రక్షణ కల్పించే ఈ ఇంజెక్షన్ వల్ల రోజూ ట్యాబ్లెట్లను వేసుకోవాల్సిన అవసరం ఉండదని, ముఖ్యంగా తరచూ ఇతర ప్రాంతాలకు వెళ్లే లైంగిక కార్మికులకు ఇది ఎంతో ఉపయోగకరమని ఆమె అభిప్రాయపడుతోంది.

సమర్థవంతంగా పనిచేస్తున్న ఇంజెక్షన్..

ప్రస్తుతం ప్రీఈపీ ట్యాబ్లెట్లు, ప్రతి రెండు నెలలకు ఒకసారి ఇచ్చే క్యాబోటెగ్రావిర్ ఇంజెక్షన్ కూడా హెచ్ఐవీ నివారణలో సమర్థవంతంగా పనిచేస్తున్నాయి. అయినప్పటికీ, దీర్ఘకాలం ప్రభావం చూపే లెనకాపావిర్ ప్రపంచవ్యాప్తంగా హెచ్ఐవీ వ్యాప్తిని తగ్గిస్తుందని ఆరోగ్య నిపుణులు భావిస్తున్నారు. అయితే ఈ ఔషధానికి డిమాండ్ ఎక్కువగా ఉన్నప్పటికీ సరిపడా నిల్వలు అందుబాటులో లేవు. హెచ్ఐవీ నివారణ నిపుణుల అభిప్రాయం ప్రకారం.. త్వరలోనే లక్షలాది మందికి ఈ ఔషధాన్ని అందించాల్సిన అవసరం ఉంది.

ఆమోదం తెలిపిన అమెరికా సంస్థ..

లెనకాపావిర్ జనరిక్ రూపానికి అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ తాత్కాలిక ఆమోదం తెలిపింది.

దీంతో తక్కువ ఆదాయం కలిగిన 120 దేశాలకు ఈ ఔషధాన్ని సరఫరా చేసే అవకాశం ఏర్పడింది. ఏడాదికి సుమారు 40 డాలర్లకే జనరిక్ ఔషధాన్ని అందించవచ్చని అంచనా. అమెరికాలో మాత్రం దీని జాబితా ధర 28,218 డాలర్లుగా ఉంది. 2028 చివరి నాటికి 30 లక్షల మందికి ఈ ఔషధాన్ని అందించాలని గ్లోబల్ ఫండ్ లక్ష్యంగా పెట్టుకుంది. అయితే మరింతమందికి తక్కువ ధరకు ఔషధం అందుబాటులోకి రావాలని డాక్టర్స్ విత్‌ఔట్ బోర్డర్స్ వంటి సంస్థలు కోరుతున్నాయి.

డోసులకు కొరత..

బరారా నగరంలో పెద్దలలో సుమారు 10 శాతం మందికి హెచ్ఐవీ ఉన్నట్లు అంచనా. ఇది ఉగాండా సగటు కంటే రెండింతలు. ఒక వ్యక్తి భార్యకు హెచ్ఐవీ సోకినట్లు నిర్ధారణ కావడంతో, తనకు రక్షణ కోసం లెనకాపావిర్ ఇంజెక్షన్ పొందాలని ప్రయత్నించాడు. కానీ ఆరోగ్య కేంద్రంలో తగినన్ని డోసులు లేవని తెలిసింది. ఏప్రిల్‌లో వచ్చిన 40 డోసులు త్వరగా పూర్తికాగా, జూన్‌లో వచ్చిన మరో 70 డోసులు కేవలం పది రోజుల్లోనే అయిపోయాయి. గత మూడు దశాబ్దాల్లో ఉగాండా హెచ్ఐవీ వ్యాప్తిని తగ్గించినప్పటికీ, లైంగిక సంబంధాల ద్వారా వైరస్ వ్యాప్తి ఇంకా ప్రధాన సమస్యగా ఉంది. ఔషధానికి డిమాండ్ అధికంగా ఉండగా, సరఫరా తక్కువగా ఉండడం వల్ల అవసరమైన వారందరికీ రక్షణ అందడం లేదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు

ఎమ్మెల్యే కూనంనేనికి కార్పొరేటర్ మునిగడప పద్మ వినతి



రుద్రంపూర్: సింగరేణి పెన్షన్స్ రూ.2 వేల లోపు వస్తే ఆసరా పెన్షన్‌కి అనుమతించాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకి 16వ డివిజన్ కార్పొరేటర్ మునిగడప పద్మ, సిపిఐ కార్పొరేటర్స్, గిరిజన సంఘం నాయకులతో కలిసి వినతి పత్రాన్ని అందించారు. శుక్రవారం స్థానిక కొత్తగూడెం క్లబ్‌లో జరిగిన ఆసరా పెన్షన్ కార్యక్రమంలో ఎమ్మెల్యేకి వినతిపత్రం అందించిన కార్పొరేటర్ మునిగడప పద్మ కరెంటు బిల్లు, నాలుగు చక్రాల వాహనం తదితర చిన్న చిన్న సాంకేతిక లోపంతో 360 డిగ్రీల పేరుతో ప్రొసీడింగ్స్ ఇవ్వకుండా ఆపిన లబ్ధిదారులకు కూడా ప్రొసీడింగ్స్ ఇచ్చి పెన్షన్స్ మంజూరు చేయాలని కోరారు. గత ఐదారు సంవత్సరాల క్రితం లబ్ధిదారులు బ్యాంకులో లోన్ ద్వారా కార్లు కొనుగోలు చేసి టాక్సీ నడుపుకున్న వారు ఆర్థిక పరిస్థితి బాగాలేక విక్రయించిన వారి కుమారులు లేదా భర్తల పేర్లు ఆన్‌లైన్‌లో 360 డిగ్రీలలో చూపెడుతున్నాయని ఆ లబ్ధిదారుల పేర్లను కూడా ఆపివేయడం జరిగిందని ఎమ్మెల్యేకు వివరించారు. స్థానికంగా చుట్టుపక్కల వారిని విచారించి వారికి నాలుగు చక్రాల వాహనం లేదని తెలితే వారికి కూడా పెన్షన్స్ మంజూరు చేయాలని ఎమ్మెల్యేకి విన్నవించారు. ఎమ్మెల్యే అధికారుల దృష్టికి తీసుకెళ్లి అనంతరం సంబంధిత అధికారులు రూ.2 వేల లోపు సింగరేణి పెన్షన్ ఉంటే చేయూత పెన్షన్‌కు అనుమతిస్తామని సభాముఖంగా హామీ ఇచ్చారని ఆమె తెలిపారు. చిన్న చిన్న సాంకేతిక కారణాలతో ఆగిన పెన్షన్లపై కూడా మరోసారి పునర్ పరిశీలన చేసి న్యాయం చేస్తామని అధికారులు తెలిపారన్నారు. అనంతరం 16వ డివిజన్‌లో 44 మంది లబ్ధిదారులకు చేయూత పెన్షన్లు మంజూరు అయినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు, మేయర్ మూడ్ గణేష్ చేతుల మీదుగా పెన్షన్ల మంజూరు పత్రాల పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గిరిజన సంఘం ప్రధాన కార్యదర్శి భూక్య శ్రీనివాస్, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మునిగడప వెంకటేశ్వర్లు, కార్పొరేటర్స్ బండి నరసింహా, బోయిన విజయ్, సుధాకర్ రాజు,ఎర్రబెల్లి శంకర్, సహారా బేగం, పోలమూరు ధనలక్ష్మి, దర్గయ్య, శాంతి ప్రియ, కంచర్ల హిమాశ్రీ, కళావతి, ఆకాంక్ష, నాగలక్ష్మి, హరిత పాల్గొన్నారు

మళ్లీ రాజుకున్న శాండ్ పేపర్ వివాదం.. ఉజ్జీని బలిపశువును చేశావ్.. కమిన్స్‌పై వార్నర్ ఫైర్



ఆస్ట్రేలియా క్రికెట్‌లో మరోసారి ప్రకంపనలు మొదలయ్యాయి. ఏడేళ్ల క్రితం దక్షిణాఫ్రికా గడ్డపై జరిగిన శాండ్‌పేపర్ ఉదంతం మళ్లీ బయటకు వచ్చింది. మాజీ ఓపెనర్ ఉస్మాన్ ఖవాజా తన ఆత్మకథ 'సబర్' (ఖ్వాఎతీ) లో చేసిన సంచలన వ్యాఖ్యలతో ఈ వివాదం తిరిగి తెరపైకి వచ్చింది. ఈ క్రమంలో మీడియా ముందుకు వచ్చిన ప్రస్తుత కెప్టెన్ పాట్ కమిన్స్.. ఖవాజా ఆరోపణలను తీవ్రంగా ఖండించాడు. అయితే, కమిన్స్ వ్యాఖ్యలపై సహచర ఆటగాడు డేవిడ్ వార్నర్ ఘాటుగా స్పందించాడు. ఖవాజా వెర్షన్‌కు పూర్తి మద్దతుగా నిలిచిన వార్నర్.. కమిన్స్ తన మాజీ సహచరుడిని 'బస్ కిందకు తోశాడు' అంటూ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు.

పెర్త్‌లో జరిగిన తొలి వన్డే సందర్భంగా కాయో స్పోర్ట్స్‌కవరేజీలో వార్నర్‌ను కమిన్స్ వ్యాఖ్యలపై ప్రశ్నించారు. దానికి సమాధానంగా వార్నర్ కుండబద్దలు కొట్టాడు."పాట్ కమిన్స్ చాలా ప్రిపేర్ అయి వచ్చాడు. నేను ఇప్పటికీ ఉజ్జీ (ఖవాజా) కి, అతడు తన పుస్తకంలో రాసిన విషయాలకే కట్టుబడి ఉన్నాను. అదే నిజం. ఈ సమయంలో అతడి పట్ల నాకు సానుభూతి ఉంది. కెప్టెన్ ఈరోజు నిజంగా ఉజ్జీని బలిపశువును చేశాడని అనుకుంటున్నాను. దాని పట్ల నేను చాలా నిరాశ చెందాను," అని వార్నర్ వ్యాఖ్యానించాడు.ఖవాజా తన 'సబర్' పుస్తకంలో 2018 కేప్‌టౌన్ టెస్ట్‌లో శాండ్‌పేపర్‌తో బాల్ టాంపరింగ్ చేసే ప్లాన్ ఆస్ట్రేలియా బౌలర్లకు ముందే తెలుసని ఆరోపించాడు. దీనిపై స్పందించిన కమిన్స్.. "ఇది పూర్తిగా చెత్త, అర్థం లేని మాట అని కొట్టిపారేశాడు. మైదానంలోకి శాండ్‌పేపర్ తీసుకెళ్తున్నట్లు తనకు ఎలాంటి సమాచారం లేదని కమిన్స్ స్పష్టం చేశాడు.ఖవాజా వ్యాఖ్యలబయటకు వచ్చినప్పటి నుంచి వార్నర్

కిలో వెండి ధర 10 గ్రాముల బంగారంతో సమానమవుతుందా?



బంగారం, వెండి మార్కెట్లు కొంతకాలంగా నిరంతర అస్థిరతను ఎదుర్కొంటున్నాయి. ఇటీవలి వరకు, వెండి ధరలు వేగంగా పెరుగుతూ పోయాయి. దీంతో పెట్టుబడిదారులు మంచి రాబడులను ఆశించారు. అయితే మార్కెట్ పరిస్థితులు మారిపోయాయి. ఇప్పుడు ధరలు క్రమంగా పడిపోతున్నాయి. ఒక కిలోగ్రాము వెండి ధరకూ, 10 గ్రాముల బంగారం ధరకూ మధ్య వ్యత్యాసం వేగంగా తగ్గిపోతున్న పరిస్థితి ఏర్పడింది. భవిష్యత్తులో ఒక కిలోగ్రాము వెండి ధర 10 గ్రాముల బంగారం ధర స్థాయికి చేరుకోగలదా?బంగారం, వెండి ధరల మధ్య తేడా ఏమిటి?శుక్రవారం నాడు మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (వీజశ)లో వెండి ఫ్యూచర్స్ కిలోకు రూ.10,500 మేర తగ్గి రూ.178,900కి చేరాయి. 10 గ్రాముల బంగారం ఫ్యూచర్స్ రూ.4,347 మేర తగ్గి రూ.138,419కి చేరాయి. దీనివల్ల సుమారు రూ.40,500 ధరల వ్యత్యాసం ఏర్పడింది. బంగారం ప్రస్తుత ధరకు చేరుకోవాలంటే వెండి ధర సుమారుగా 22.6% తగ్గాల్సి ఉంటుంది. అయితే, బంగారం ధర స్థిరంగా ఉంటేనే ఇది సాధ్యమవుతుంది.బంగారు రుణం వర్సెస్ వ్యక్తిగత రుణం.. ఈ రెండింటిలో ఏది మీకు బెస్ట్‌అండి దాని రికార్డు స్థాయి నుండి ఎంత పడిపోయింది?జనవరి 2026లో వీజశలో వెండి ధర కిలోకు రూ.420,048 వద్ద రికార్డు స్థాయికి చేరుకుంది. అయితే, శుక్రవారం నాటి ధర ప్రకారం, ఇది తన గరిష్ట స్థాయి నుండి సుమారు 57% పడిపోయింది. అదే సమయంలో, జనవరిలో 10 గ్రాములకు రూ.180,779 రికార్డు ధరకు చేరుకున్న బంగారం ధర కూడా సుమారు 23% పడిపోయింది. అంతర్జాతీయ మార్కెట్‌లో వెండి ధరలు కూడా తీవ్రంగా పడిపోయాయి. శుక్రవారం స్పాట్ వెండి దాదాపు 6% తగ్గి ఔన్సుకు వి49కి చేరగా, బంగారం ఔన్సుకు సుమారు వి3,875 వద్ద ట్రేడవుతోంది.వెండి ధరలు ఎందుకు పడిపోయాయి?వెండి ధరల తగ్గుదలకు అనేక కారణాలు చెబుతున్నారు. అమెరికా స్టాక్ మార్కెట్‌లో టెక్ స్టాక్‌ల అమ్మకాలు, అధిక ముడి చమురు ధరలు, అమెరికాలో వడ్డీ రేట్లు పెరుగుతాయనే భయాలు బంగారం, వెండిపై ఒత్తిడిని పెంచాయి. వెండికి ఉన్న డిమాండ్‌లో అధిక భాగం పారిశ్రామిక అవసరాల నుండే వస్తుంది కాబట్టి, అది ఎక్కువగా నష్టపోయింది. అందువల్ల ఆర్థిక వృద్ధి మందగిస్తుందనే భయాలు పెరిగినప్పుడు దాని ధర ఎక్కువగా ప్రభావితమవుతుంది.

కెప్టెన్‌గా తొలి మ్యాచ్‌లోనే డకౌట్.. శ్రేయస్ అయ్యర్ పేరిట చెత్త రికార్డు



న్యూజిలాండ్‌తో జరుగుతున్న నాలుగో వన్డేలో టీమిండియాకు ఊహించని షాక్ తగిలింది. 334 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆరంభంలోనే కోలుకోలేని దెబ్బ పడింది. స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ముగ్గురూ ఒక్క పరుగు కూడా చేయకుండానే పెవిలియన్‌కు చేరారు. మౌంట్ మౌంగనూయ్‌లోని బే ఓవల్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్ పేసర్ మాట్ హెన్రీ తన తొలి ఓవర్‌లోనే భారత టాప్ ఆర్డర్‌ను కుప్పకూల్చాడు. దీంతో భారత వన్డే క్రికెట్ చరిత్రలోనే ఎన్నడూ లేని చెత్త రికార్డు నమోదైంది

తొలి ఓవర్‌లోనే మూడు వికెట్లు

న్యూజిలాండ్ తొలుత బ్యాటింగ్ చేసి 50 ఓవర్లలో 333 పరుగులు చేసింది. విల్ యంగ్ 125 పరుగులతో రాణించగా, టిమ్ సీఫర్ట్ 58 పరుగులు చేశాడు. దీంతో భారత్ ముందు 334 పరుగుల లక్ష్యం నిలిచింది. ఈ లక్ష్యాన్ని ఛేదించేందుకు రోహిత్ శర్మ, రుతురాజ్ గైక్వాడ్ ఓపెనర్లుగా బరిలోకి దిగారు. అయితే మాట్ హెన్రీ వేసిన తొలి బంతికే రోహిత్ శర్మ అవుటయ్యాడు. బయటకు కదిలిన బంతిని ఆడే ప్రయత్నంలో రోహిత్ బ్యాట్‌కు తగిలిన బంతి ఫస్ట్ స్లిప్‌లో ఉన్న ఫిన్ అలెన్ చేతుల్లోకి వెళ్లింది. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన విరాట్ కోహ్లీ నాలుగు బంతులు ఎదుర్కొని డకౌట్ అయ్యాడు. హెన్రీ వేసిన బంతి లోపలికి దూసుకొచ్చి, అనూహ్యంగా కిందకు ఉండటంతో కోహ్లీ క్లీన్ బౌల్డ్ అయ్యాడు.కెప్టెన్సీ తొలి మ్యాచ్‌లోనే డకౌట్ఇక నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ కూడా ఖాతా తెరవకుండానే వెనుదిరిగాడు. హెన్రీ వేసిన ఓవర్ చివరి బంతి అయ్యర్ ప్యాడ్లకు తగిలింది. మైదానంలోని అంపైర్ తొలుత నాటౌట్‌గా ప్రకటించినా, న్యూజిలాండ్ రివ్యూ తీసుకుంది. రీప్లేలో బంతి వికెట్లను తాకుతున్నట్లు తేలడంతో అంపైర్ నిర్ణయం మారింది. దీంతో అయ్యర్ ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగాడు. శుభ్‌మన్ గిల్ అందుబాటులో లేకపోవడంతో ఈ మ్యాచ్‌లో తొలిసారి వన్డే కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టిన అయ్యర్‌కు ఇది చేదు అనుభవంగా మిగిలింది. వన్డేల్లో భారత జట్టుకు కెప్టెన్సీ చేసిన తొలి మ్యాచ్‌లోనే డకౌట్ అయిన తొలి భారత ఆటగాడిగా అయ్యర్ నిలిచాడు.భారత వన్డే చరిత్రలో తొలిసారిఒక వన్డే ఇన్నింగ్స్‌లో ఒక్క పరుగు కూడా చేయకముందే తొలి మూడు వికెట్లు కోల్పోవడం భారత జట్టుకు ఇదే మొదటిసారి. అంతర్జాతీయ వన్డే క్రికెట్‌లోనూ ఇది అత్యంత అరుదైన ఘటనగా నిలిచింది. అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం, ఇలాంటి పరిస్థితి గతంలో పాకిస్థాన్ రెండుసార్లు, బంగ్లాదేశ్ ఒకసారి, ఆస్ట్రేలియా ఒకసారి ఎదుర్కొన్నాయి. ఇప్పుడు భారత్ కూడా ఈ జాబితాలో చేరింది. 1983 ప్రపంచకప్‌లో జింబాబ్వేతో జరిగిన మ్యాచ్‌లో భారత్ 9 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయింది. ఆ తర్వాత మళ్లీ తొలి నాలుగు వికెట్లు 10 పరుగుల లోపే పడటం ఇది రెండోసారి. ఆ మ్యాచ్‌లో భారత్ 17 పరుగులకే ఆలౌట్ అయ్యే ప్రమాదం నుంచి కపిల్ దేవ్ చారిత్రాత్మక ఇన్నింగ్స్‌తో బయటపడిన విషయం తెలిసిందే.

ధంతేరస్ రోజున బంగారం, వెండి కొంటున్నారా.. ఈ టైమ్ మిస్ కావొద్దు.



ప్రతి సంవత్సరం దీపావళికి ముందు వచ్చే ధంతేరస్ రోజున బంగారం కొంటే మంచిదని చాలామంది నమ్ముతారు. ఈ ఏడాది నవంబర్ 8వ తేదీన దీపావళి వస్తుండగా.. నవంబర్ 6న శుక్రవారం ధంతేరస్ వస్తుంది. లక్ష్మీదేవి, కుబేరుడికి ఈ పండుగను అంకితం చేశారు. దీంతో నవంబర్ 6న బంగారం కొంటే శుభం జరుగుతుందని, సంపద, ఆరోగ్యం, శ్రేయస్సు కలుగుతుందని బాగా నమ్ముతారు. ముఖ్యంగా స్త్రీలు ఈ రోజున బంగారం కొనుగోలు చేయడానికి ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తుంటారు. ధంతేరస్ రోజున బంగారం కొనుగోలు చేయడానికి మంచి ముహూర్తం ఏంటనేది ముందే తెలుసుకుంటారు. ఆ సమయానికి వెళ్లి బంగారం, సిల్వర్ లాంటివి కొనుగోలు చేసే సాంప్రదాయం దేశంలో కొనసాగుతోంది. ఈ క్రమంలో ధంతేరస్ రోజున బంగారం కొనుగోలు చేయడానికి మంచి సమయం ఏంటనేది తెలుసుకుందాం.హైదరాబాద్‌లో మంచి సమయం ఇదే..ధంతేరస్ రోజున బంగారం, వెండి కొంటే శ్రేయస్సు, సమృద్ధి, అదృష్టం కలుగుతుందనే నమ్మకం చాలామందిలో ఉంటుంది. ఈ రోజున బంగారు ఆభరణాలు, నాణెలు లేదా వెండి పాత్రలు, ఇతర విలువైన లోహాలను కొనుగోలు చేసే సాంప్రదాయం ఇప్పటికీ ఉంది. కొనుగోలు చేసిన వస్తువులను పూజ గదిలో పెట్టి పూజలు నిర్వహిస్తారు. ఈ రోజున బంగారం, వెండి కొనుగోలు చేసేందుకు మంచి సమయం, ముహూర్తం ఏంటనేది ముందే పండితుల ద్వారా తెలుసుకుని తమ కొనుగోళ్లను ప్లాన్ చేసుకుంటారు. అయితే మంచి సమయాలు అనేవి ప్రాంతాన్ని బట్టి మారుతుంటాయి. హైదరాబాద్ విషయానికొస్తే.. నవంబర్ 6న ఉదయం 10.30 గంటల తర్వాత ఎప్పుడైనా బంగారం కొనుగోలు చేసేందుకు మంచి సమయమని పండితులు చెబుతున్నాయి. అయితే సాయంత్రం 6.15 గంటల నుంచి 8.13 గంటల వరకు మధ్య కొనుగోలు చేస్తే మరింత మంచిదని అంటున్నారు. సాయంత్రం షాపుల్లో ఎక్కువ జనం రద్దీ ఉంటుంది గనుక ఉదయం 10.30 గంటల తర్వాత ఎప్పుడైనా కొనుగోలు చేయవచ్చని సూచిస్తున్నారు.ఈ వస్తువులను కూడా కొనుగోలు చేసే సాంప్రదాయం ఇక ధంతేరస్ రోజున బంగారం, వెండితో పాటు ఇత్తడి, రాగి, స్టెయిన్‌లెస్ స్టీల్ పాత్రలను ఎక్కువగా కొనుగోలు చేస్తారు. కొత్తగా కొన్న

కెప్టెన్‌గా తిలక్ వర్మ.. రైజింగ్ స్టార్స్ ఆసియా కప్‌కు టీమిండియా ఏ టీమ్ ఇదే.. ఆ డేంజర్ ప్లేయర్లకు ఛాన్స్..



ఖతార్ వేదికగా జరగనున్న ప్రతిష్టాత్మక ఏసీసీ మెన్స్ రైజింగ్ స్టార్స్ ఆసియా కప్ 2026 టోర్నీ కోసం బీసీసీఐ 15 మంది సభ్యులతో కూడిన బలమైన ఇండియా-ఎ జట్టును ప్రకటించింది. నవంబర్ 19 నుంచి 29 వరకు దోహాలో ఈ టోర్నమెంట్ జరగనుంది. యువ సంచలనం తిలక్ వర్మను కెప్టెన్‌గా ఎంపిక చేయగా, అనుభవజ్ఞుడైన బ్యాటర్ రజత్ పాటిదార్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. ఇండియా-ఎ బ్యాటింగ్ లైనప్‌ను బీసీసీఐ అత్యంత పటిష్టంగా తీర్చిదిద్దింది. విధ్వంసక ఓపెనర్ అభిషేక్ శర్మతో పాటు దేశవాళీ క్రికెట్‌లో తన దూకుడైన ఆటతీరుతో సంచలనం సృష్టిస్తున్న 15 ఏళ్ల చిచ్చరపిడుగు వైభవ్ సూర్యవంశీకి జట్టులో చోటు దక్కింది. మిడిలార్డర్‌లో కెప్టెన్ తిలక్ వర్మ, రజత్ పాటిదార్ బాధ్యత తీసుకోనుండగా మ్యాచ్ ఫినిషర్‌గా రింకూ సింగ్ కీలకం కానున్నాడు. వికెట్ కీపర్లుగా ప్రభ్‌సిమ్రన్ సింగ్, కుమార్ కుశాగ్రా ఎంపికయ్యారు.ఆల్‌రౌండర్స్, బౌలర్స్ వీరే..ఆల్‌రౌండర్ల విభాగంలో సూర్యాంశ్ షెడ్గే, షాబాజ్ అహ్మద్, విప్రాజ్ నిగమ్, హర్ష్ దూబే, తనుష్ కోటియన్ ఉండటంతో జట్టుకు బౌలింగ్, బ్యాటింగ్ ఆప్షన్లు పుష్కలంగా ఉన్నాయి. పేస్ బౌలింగ్ విభాగాన్ని హర్షిత్ రాణా, ప్రిన్స్ యాదవ్, అర్షద్ ఖాన్ నడిపించనున్నారు. ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌ను 3-2తో కైవసం చేసుకున్న భారత సీనియర్ జట్టులో భాగమైన పలువురు ఆటగాళ్లు ఈ ఇండియా-ఎ స్క్వాడ్‌లో ఉండటం విశేషం.గ్రూప్-బిలో భారత్.. నవంబర్ 22న పాకిస్థాన్‌తో హైవోల్టేజ్ పోరుఈ టోర్నమెంట్‌లో ఇండియా-ఎ జట్టు గ్రూప్-బిలో చోటు దక్కించుకుంది. భారత్‌తో పాటు దాయాది పాకిస్థాన్-ఎ, నేపాల్, యూఏఈ జట్లు ఈ గ్రూప్‌లో ఉన్నాయి. గ్రూప్-ఎలో బంగ్లాదేశ్-ఎ, శ్రీలంక-ఎ, ఆఫ్ఘనిస్థాన్-ఎ, హాంకాంగ్ జట్లు తలపడ నున్నాయి. దోహాలోని వెస్ట్ ఎండ్ పార్క్ ఇంటర్నేషనల్ స్టేడియం వేదికగా నవంబర్ 20న నేపాల్‌తో జరిగే తొలి మ్యాచ్‌తో భారత్ తన ప్రయాణాన్ని ప్రారంభిస్తుంది. అనంతరం నవంబర్ 22న దాయాది పాకిస్థాన్-ఎతో హైవోల్టేజ్ పోరు జరగనుంది. నవంబర్ 24న యూఏఈతో చివరి గ్రూప్ మ్యాచ్ ఆడనుంది. రెండు గ్రూపుల నుంచి టాప్-2లో నిలిచిన జట్లు నవంబర్ 26, 27 తేదీల్లో జరిగే సెమీఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి. నవంబర్ 29న గ్రాండ్ ఫైనల్ జరుగుతుంది.

రైజింగ్ స్టార్స్ ఆసియా కప్‌నకు భారత జట్టుతిలక్ వర్మ (కెప్టెన్), రజత్ పాటిదార్ (వైస్ కెప్టెన్), అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, ప్రభ్‌సిమ్రన్ సింగ్ (వికెట్ కీపర్),

ఇక బిస్కెట్ల వ్యాపారంలోకి అంబానీ గ్రూప్.. మార్కెట్లోకి 9 కొత్త రకాలు..!



: ముఖేష్ అంబానీ ప్రపంచంలోని అత్యంత ధనవంతులలో ఒకరు. అలాగే భారతదేశంలో నంబర్ 1 ధనవంతుడు. అతని కుటుంబ నికర ఆస్తి విలువ సుమారు 88.8 మిలియన్ అమెరికన్ డాలర్లు. ముఖేష్ అంబానీ కుటుంబం ఇప్పటికే రిలయన్స్ వంటి కంపెనీల ద్వారా వివిధ రంగాలలో వ్యాపారం చేస్తోంది. కానీ ఇప్పుడు ఒక కొత్త రంగంలోకి ప్రవేశించింది. అంబానీ గ్రూప్ ఇప్పుడు బిస్కెట్ పరిశ్రమలోకి అడుగుపెట్టింది.


రిలయన్స్ ఇండస్ట్రీస్ ఇటీవల క్యాంపా కోలాతో శీతల పానీయాల పరిశ్రమలోకి ప్రవేశించింది. దాని తర్వాత ఇప్పుడు బిస్కెట్ల పరిశ్రమలోకి కూడా ప్రవేశించాలని యోచిస్తోంది. అదేంటంటే, అంబానీ గ్రూప్ ' ఇండిపెండెన్స్' బ్రాండ్ క్రింద 9 కొత్త రకాల బిస్కెట్లను విడుదల చేయబోతోంది. ఈ బిస్కెట్లను మొదటి దశలో తమిళనాడులో అందుబాటులోకి వచ్చాయి. ఆ తర్వాత ఈ బిస్కెట్లు భారతదేశంలోని మరికొన్ని రాష్ట్రాలలో కూడా అందుబాటులోకి వస్తాయి. ఈ బిస్కెట్లను 5, 10, 40, 125 రూపాయల వివిధ ధరలలో విడుదల చేస్తారురిలయన్స్ తన కొత్త బిస్కెట్లను పలు రకాల్లో విడుదల చేసింది. వాటిలో పవర్ అప్, బటర్ బ్లిస్, మిల్కీ పవర్, మేరీ ప్రైమ్ వంటి రెగ్యులర్ బిస్కెట్లు, అలాగే కోకో, వనిల్లా, చాక్లెట్ క్రీమ్ యమ్ ఆరెంజ్, చాక్లెట్ క్రీమ్ యమ్ చోకో వంటి క్రీమ్ బిస్కెట్లు, ఇలా మొత్తం 9 రకాల బిస్కెట్లు ఉన్నాయి.బిస్కెట్ మార్కెట్ విలువభారతదేశంలోని బిస్కెట్ మార్కెట్‌లో ఇప్పటికే అనేక ప్రముఖ కంపెనీలు ఆధిపత్యం చెలాయిస్తున్నా యి. ఈ క్రమంలో రిలయన్స్ గ్రూప్ కూడా మార్కెట్లోకి ప్రవేశించింది. దీని కారణంగా భారతీయ బిస్కెట్ మార్కెట్ చాలా పోటీగా మారింది. ముఖ్యంగా, 2024 ఆర్థిక సంవత్సరంలో రూ. 55,100 కోట్లుగా ఉన్న బిస్కెట్ మార్కెట్ విలువ, 2029 నాటికి రూ. 90,300 కోట్లకు పెరుగుతుందని అంచనా. భారత ప్రజలలో బిస్కెట్ల వినియోగం అధికంగా ఉండటం వల్ల, కంపెనీలు వరుసగా బిస్కెట్ల ఉత్పత్తి రంగంలోకి ప్రవేశిస్తున్నాయనేది గమనార్హం.

బిగ్‌బాస్ విన్నర్ అతడే.. రాంప్రసాద్, దేబ్జానీలకు హింట్స్..



బిగ్‌బాస్ తెలుగు సీజన్ 10 ఫ్యామిలీ వీక్ నడుస్తున్న సంగతి తెలిసిందే. ఇక నిన్నటి (నవంబర్ 12న) జరిగిన ఎపిసోడ్ లోదేబ్జానీ తల్లిదండ్రులు హౌస్‌లోకి అడుగుపెట్టారు. కూతురిని కలిసిన సందర్భంలో త్రిగుణ్‌తో బాగా కలిసిమెలిసి ఉండాలని ఆమెకు సూచించారు. నామినేషన్ల సమయంలో బలమైన పాయింట్లు చెప్పాలని, కోపాన్ని తగ్గించుకోవాలని సూచించారు. దీంతో పేరెంట్స్ చెప్పిన సలహాను అర్థం చేసుకున్నానని చెప్పింది. ఈ ఎపిసోడ్‌లో దేబ్జానీ కుటుంబంతో పాటు సుధీర్, రాంప్రసాద్ కుటుంబ సభ్యులు కూడా హౌస్‌లోకి వచ్చారు. అంతకుముందు నరేశ్ సోదరుడు సురేశ్, శ్వేత తండ్రి, సోదరి, వంశీ భార్య, కూతురు ఇంట్లోకి వచ్చారు. ఫ్యామిలీ వీక్ ప్రారంభంలో బిగ్‌బాస్ 'బీబీ స్కూల్' టాస్క్ ఇచ్చాడు. ఇందులో నరేశ్ ప్రిన్సిపల్‌గా, దేబ్జానీ తెలుగు టీచర్‌గా వ్యవహరించారు. ఈ వారం ఇంట్లోకి వచ్చిన వారంతా హౌస్‌మేట్స్‌కు ఆటకు సంబంధించిన సూచనలు ఇస్తున్నారు.దేబ్జానీ తండ్రి నరేశ్‌తో సరదాగా గడపడం ఎపిసోడ్‌లో నవ్వులు పూయించింది. కుటుంబ సభ్యులు వచ్చినప్పుడు హౌస్‌మేట్స్ భావోద్వేగానికి ఎమోషనల్ అవుతున్నారు. శ్వేత తన తండ్రిని కౌగిలించుకుని కన్నీళ్లు పెట్టుకుంది. వంశీ తన కూతురికి స్వయంగా వండి పెట్టాడు. ఈ వారం ఇంట్లోకి వచ్చిన చాలా మంది త్రిగుణ్‌ను ప్రశంసించారు. శ్వేత తండ్రి అతడిని 'గేమ్ ఛేంజర్' అని మెచ్చుకున్నారు. హౌస్ లో గొడవలు జరిగిన తర్వాత కూడా హౌస్‌మేట్స్‌తో సాధారణంగా కలిసిపోయే అతడి తీరును ఆయన అభినందించారు. వంశీ భార్య కూడా తన కుటుంబానికి అండగా నిలిచినందుకు త్రిగుణ్‌కు ధన్యవాదాలు చెప్పింది.ఇక ఐరన్ చేసుకుని స్టీమర్ అలాగే వదిలేశాడు.. ఇలాంటి బాధ్యత ఉన్న వాడిని మీరు కెప్టెన్ చేశారు.. మిమ్మల్ని ఏమనాలి అంటూ నరేష్ ను అడిగాడు ముకేష్. దీంతో త్రిగుణ్ వచ్చి ఎప్పటిలాగే కవరింగ్ చేసే ప్రయత్నం చేస్తాడు. దీంతో త్రిగుణ్, ముకేష్ మధ్య మరోసారి మాటల యుద్ధం నడుస్తుంది. మొత్తానికి ఈ ఫ్యామిలీ వారంలో విన్నర్ ఎవరు అనే విషయాన్ని హింట్స్ ఇస్తూ వెళ్లారు ఫ్యామిలీ మెంబర్స్.

DNK
సినిమా రివ్యూ..



యూ ట్యూబ్‌లో మౌళి టాక్స్ పేరుతో షార్ట్ ఫిల్మ్ చేసుకునే మౌళి.. 'లిటిల్ హార్ట్స్' సినిమాతో సడన్‌గా హీరో అయిపోవడమే కాదు.. అదిరిపోయే బ్లాక్‌బస్టర్ కొట్టారు. దాంతో వెంటనే మైత్రి మూవీ మేకర్స్ లాంటి బ్యానర్ నుంచి ఆఫర్ అందుకుని చేసిన సినిమానే 'దొంగ నా కొడుకు'. సెన్సార్ పుణ్యమా అని దీని పేరు తర్వాత ణచీఖ గా మార్చారు. మరి ఆ సినిమా ఎలా ఉందో పూర్తి రివ్యూలో చూద్దాం..యూట్యూబర్ నుంచి హీరోగా మారిన మౌళి తన డెబ్యూ మూవీ 'లిటిల్ హార్ట్స్' తో గతేడాది బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నాడు. ఇప్పుడు ఏకంగా మైత్రీ మూవీ మేకర్స్ లాంటి బడా బ్యానర్ లో శ్రీను కంబాల అనే కొత్త దర్శకుడితో 'డీఎన్‌కే' అనే క్రైమ్ కామెడీ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. తొలి సినిమాతో భారీ హిట్ కొట్టిన మౌళి రెండో ప్రయత్నంలో కూడా సక్సెస్ అయ్యాడా? కొత్త దర్శకుడు శ్రీను కంబాల తన డెబ్యూ సినిమాతో ఆకట్టుకున్నాడా? అనేది ఈ రివ్యూలో తెలుసుకుందాం.కథ:ఈశ్వర్ (మౌళి) చదువు మధ్యలో ఆపేసి, ఎలాంటి పనీపాటా లేకుండా క్రికెట్ బెట్టింగ్స్, ఆన్లైన్ గేమ్స్ ఆడుతూ ఈజీగా డబ్బు సంపాదించాలని చూసే కుర్రాడు. తల్లి దండ్రులు (అలీ, రజిత) ఎంత చెప్పినా కూడా వాళ్ల మాట అస్సలు వినడు. అతడు దీపు (సుష్మిత శెట్టి) అనే డబ్బున్న అమ్మాయితో ప్రేమలో పడతాడు. అయితే ఈశ్వర్ ఆమె దగ్గర 10 లక్షల రూపాయలు తీసుకుని క్రికెట్ బెట్టింగ్‌లో పోగొడతాడు. ఈ విషయం తెలుసుకున్న దీపు తండ్రి పుల్లయ్య (రఘుబాబు), తన డబ్బు వెంటనే తిరిగి ఇచ్చేయాలని ఈశ్వర్‌ను బెదిరిస్తాడు. అప్పుడు ఆ డబ్బు కోసం ఈశ్వర్ వేసిన ప్లాన్ ఏంటి..? అతడు ఒక బంగారు దుకాణం దోపిడీలో ఎలా ఇరుక్కున్నాడు..? ఆ దొంగతనం ఈశ్వర్ చేశాడా లేక వేరే ఎవరైనా చేశారా? ఈ సమస్యల నుంచి ఈశ్వర్ ఎలా బయటపడ్డాడు అనేది తెర మీదే చూడాలి.కథనం:టాలీవుడ్‌లో 'మనీ', 'స్వామి రారా', 'బ్రోచేవారెవరురా' సహా లాంటి ఎన్నో క్రైమ్ కామెడీ సినిమాలు వచ్చి ప్రేక్షకులను బాగా అలరించాయి. ఆ సినిమాలు అలా గుర్తుండిపోయాయంటే అందులో ఉన్న కథ కంటే కథనం చాలా ముఖ్యం. ఎందుకంటే స్క్రీన్ ప్లే బేస్డ్ క్రైమ్ కామెడీలకు తిరుగుండదు. కథ కాస్త అటూ ఇటూగా ఉన్నా.. కథనం వర్కవుట్ అయితే చాలు ఈ సినిమాలన్నీ దుమ్ము దులిపేస్తుంటాయి. ఈ 'ణచీఖ' కోసం కూడా దర్శకుడు శ్రీను కంభాల ఒక మంచి పాయింట్‌నే తీసుకున్నాడు, కానీ ఆ పాయింట్ ను ఎంగేజింగ్ గా చెప్పడంలో మాత్రం పూర్తిగా విఫలమయ్యాడు. క్రైమ్ కామెడీ సినిమాలకు కావాల్సిన ఫ్రెష్ నెస్ ఈ సినిమాలో ఎక్కడా కనిపించదు. ముఖ్యంగా కామెడీ కోసం గే క్యారెక్టర్స్ ను వాడుకోవడం, డబుల్ మీనింగ్ డైలాగ్స్ తో నవ్వించాలని చూడటం చాలా ఇబ్బందిగా అనిపిస్తుంది. మైత్రీ మూవీ మేకర్స్ లాంటి పెద్ద బ్యానర్ నుంచి ఇలాంటి నాసిరకం రైటింగ్ తో సినిమా రావడం ఆశ్చర్యం కలిగిస్తుంది. సొంతంగా కామెడీ సీన్స్ రాసుకోలేక పాత బ్లాక్ బస్టర్ సినిమాల రిఫరెన్స్ లను దర్శకుడు యథేచ్ఛగా వాడేశాడు. ఖడ్గం, నువ్వు నాకు నచ్చావ్, శివాజీ, బిగిల్, చంద్రముఖి, ఓజీ లాంటి ఎన్నో సినిమాల డైలాగ్స్, సాంగ్స్ ను కామెడీ కోసం స్పూఫ్‌ల కింద వాడేసుకున్నాడు. అయితే దర్శకుడు రాసుకున్న కొన్ని ట్విస్టులు మాత్రం పర్వాలేదు అనిపిస్తాయి. ముఖ్యంగా లాఫింగ్ బుద్ధా విగ్రహంతో హీరో ఎంట్రీ, దానికి క్లైమాక్స్ లో ఇచ్చిన ముగింపు కాస్త ఆసక్తికరంగా ఉంటాయి. మొదటి సినిమాలో మౌళి చాలా నాచురల్ గా కనిపిస్తాడు, కానీ ఈ సినిమాలో అతన్ని అనవసరమైన స్లో మోషన్ షాట్స్ తో ఒక మాస్ హీరోలా చూపించడానికి చేసిన ప్రయత్నం బెడిసికొట్టింది. సినిమా మొత్తం ఒక మూస పద్ధతిలో, పాత జోకులతో విసుగు తెప్పిస్తుంది. బిల్డప్ ఎక్కువగా కనిపించినా.. కథనంలో అంత సత్తా కనిపించదు.

దిల్ మూవీతో వచ్చిన ప్రాఫిట్ అంతా తరుణ్ సినిమాతో పోయింది



ప్రముఖ నిర్మాత దిల్ రాజు తన సినీ ప్రస్థానంలోని ఒడిదుడుకులను, ముఖ్యంగా తన మొదటి బ్లాక్‌బస్టర్ దిల్ సినిమా విజయం, ఆ లాభాన్ని హీరో తరుణ్ నటించిన నిన్నే ఇష్టపడ్డాను చిత్రం ఎలా హరించివేసిందో ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. ఈ వ్యాఖ్యలు సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తించాయి. తొలినాళ్లలో దిల్ రాజు డిస్ట్రిబ్యూటర్‌గా మూడు వరుస ప్లాపులు చవిచూశారు. దీనివల్ల పరిశ్రమలో చేయి మంచిది కాదు అనే సెంటిమెంట్‌తో ఆయనను ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. ఈ దశలో ఆయన దిల్ సినిమా నిజాం హక్కులను కొనుగోలు చేసేందుకు ప్రయత్నించారు. ఆరు లక్షల రూపాయలు చెల్లించి, మొత్తం 60 లక్షల రూపాయల డీల్‌ను పూర్తి చేయడానికి చాలా మంది ఆఫీసుల చుట్టూ తిరిగారు. అయితే ఆయన గత రికార్డు, సినిమా కాన్సెప్ట్‌రణంగా ఎవరూ పెట్టుబడి పెట్టడానికి ముందుకు రాలేదు. ఇలాంటి సమయంలో, సినీ దిగ్గజం ఎం.ఎస్. రెడ్డి (తలంబాలు, ఆవుతి, అంకుశం వంటి చిత్రాల నిర్మాత) ఒక మీడియేటర్ ద్వారా దిల్ రాజును సంప్రదించారు. ఎం.ఎస్. రెడ్డి భాగస్వామ్యం అడగడం దిల్ రాజుకు ఆశ్చర్యాన్ని, సంతోషాన్ని కలిగించింది. హైదరాబాద్‌లో జరిగిన చర్చల అనంతరం, ఎం.ఎస్. రెడ్డి దిల్ సినిమాలో 50% వాటా తీసుకునేందుకు అంగీకరించారు. దిల్ రాజు చెల్లించిన ఆరు లక్షల రూపాయలకు అదనంగా, ఎం.ఎస్. రెడ్డి మరో ఆరు లక్షలు చెల్లించి, వారి భాగస్వామ్యాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత దిల్ రాజుతో కలిసి చెన్నై వెళ్లి, సుబ్రమణ్యేశ్వర ఫిలిమ్స్ పేరు మీద అగ్రిమెంట్‌ను పూర్తి చేయించారు.దిల్ చిత్రం

వామ్మో.. ఈ టాలీవుడ్ హీరోయిన్ మాములిది కాదు



తెలుగు చలనచిత్ర పరిశ్రమలో మంచి గుర్తింపు తెచ్చుకున్న నటి అతుల్య చంద్ర. మలయాళం, తెలుగులో పలు చిత్రాల్లో నటించి గుర్తింపు తెచ్చుకుంది. తాజాగా ఈ హీరోయిన్ ఒక సంచలన కేసులో చిక్కుకోవడం సినీ వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది. కొచ్చికి చెందిన ఒక వైద్యుడిని బెదిరించి, దోపిడీకి పాల్పడిందట. ఆమె పై వచ్చిన ఈ తీవ్ర ఆరోపణల నేపథ్యంలో కేరళ పోలీసులు ఆమెను అరెస్ట్ చేసినట్లు సమాచారం. ఈ వార్త ప్రస్తుతం టాలీవుడ్ , మలయాళ సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. సమాచారం ప్రకారం.. కొచ్చిలోని ఒక ప్రముఖ వైద్యుడిని లక్ష్యంగా చేసుకుని ఈ రాబరీ జరిగినట్లు తెలుస్తోంది.కేరళలోని కొచ్చిలో అతుల్య చంద్ర.. నటుడు, నిర్మాత బిబిన్ పెరుంబిల్లితో కలిసి సోమవారం తన అపార్ట్ మెంట్ నుంచి స్థానిక వైద్యుడికి ఫోన్ చేసింది. తన బంధువుకు అత్యవసర వైద్యసాయం అందించేందుకు ఇంటికి రావాలని ఆయనను పిలిచింది. ఉదయం ఆరున్నరకు డాక్టర్ వాళ్ల ఫ్లాట్ కు వెళ్లేసరికి అక్కడ దాదాపు 12 మంది యువతి యువకులు ఉన్నారు. అందరూ కలిసి సదరు డాక్టర్ పై దాడి చేసి అతడి దగ్గరున్న నగదు, ఫోన్, వాచ్, వైర్ లెస్ ఇయర్ ఫోన్స్ లాక్కున్నారు. ఇదంతా పోలీసులకు చెబితే వైద్యం కోసం వచ్చి మ బంధువుపై అత్యాచారానికి ప్రయత్నించావని కేసు పెడతామి బెదిరించారు. అక్కడి నుంచి తప్పించుకున్న బాధిత డాక్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన కొచ్చి పోలీసులు ప్రాథమిక విచారణ చేపట్టి, ఆధారాల ఆధారంగా అతుల్య చంద్రతో పాటు ఆమెతో ఉన్న అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. బాధితుడి నుంచి భారీ మొత్తంలో నగదు లేదా విలువైన వస్తువులను బెదిరించి గుంజినట్లు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేశారు.శ్రీసింహా కోడూరి కథానాయకుడిగా పరిచయమైన క్రైమ్ హాస్య చిత్రం 'మత్తు వదలరా' లో అతుల్య చంద్ర ఒక కీలకమైన పాత్రలో కనిపించి తెలుగు ప్రేక్షకులకు పరిచయమయ్యారు. ఆ సినిమాలో తన్న మలయాళ ప్రాజెక్టులలోనూ నటించారు. సినీ కెరీర్ ఆశాజనకంగా సాగుతున్న సమయంలోనే ఆమె ఇలాంటి నేరపూరిత ఉదంతంలో అరెస్ట్ కావడం అందరినీ దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ ఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తు కొనసాగుతోందని, దోపిడీ వెనుక ఉన్న అసలు కారణాలు ,ఇతర వ్యక్తుల ప్రమేయంపై విచారిస్తున్నామని కేరళ పోలీసులు స్పష్టం చేశారు.

వాళ్లు నాశనం అవ్వాలనే కోరుకుంటా..



జబర్దస్త్ కామెడీ షో ద్వారా బుల్లితెరపై విపరీతమైన క్రేజ్ సంపాదించుకున్నాడు చలాకీ చంటి. ఆ తర్వాత సినిమాల్లో హాస్య నటుడిగా కనిపించిన చంటి.. ఇప్పుడు అంతగా మూవీస్ చేయడం లేదు. ఇదిలా ఉంటే.. గతంలో ఓ ఇంటర్వ్యూలో నటుడు చలాకీ చంటి మాట్లాడుతూ తన జీవితంలోని బాధలు, మోసాలు, సినీ పరిశ్రమలో ఎదురైన అనుభవాలపై తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. "నా ఎదుగుదలను అడ్డుకున్నవారు, నాకు జరగాల్సిన సమయాల్లో అవకాశాలు ఆగిపోవడానికి ప్రత్యక్షంగా గానీ పరోక్షంగా గానీ కారణమైన ప్రతి ఒక్కడూ సర్వనాశనం అయిపోవాలి" అని ఆగ్రహంగా, శాపనార్థం చేస్తూ మాట్లాడారు. తన కడుపుమండితోనే ఈ మాటలు చెబుతున్నానని, ఎదుటివారికి చెడు కోరుకోవద్దు అని చెప్పడం తప్పు అని తన అభిప్రాయాన్ని వెల్లడించారు. తన చెడును కోరుకున్నప్పుడు తాను ఎందుకు వారి చెడును కోరుకోకూడదని ఆయన ప్రశ్నించారు. ఇది కేవలం మానవ సహజ స్వభావమని, "నేను బాగుంటేనే నువ్వు బాగుండాలని కోరుకుంటా, నేను నాశనం అవ్వడానికి కారణమైనవాడు నాశనం అవ్వాలి" అని ఆయన స్పష్టం చేశారు.తన సినీ ప్రయాణంలో ఎదురైన కష్టాలు, ముఖ్యంగా ఇండస్ట్రీలో తనకు "ఈగో" ఉందనే అపవాదుపై చంటి వివరణ ఇచ్చారు. ఒక ఆర్టిస్టుగా ప్రతిసారీ వంగి వంగి రావడం సాధ్యం కాదని, అది కొందరికి నచ్చకపోవచ్చని అన్నారు. కో-డైరెక్టర్లు లేదా ఇతర టీమ్ సభ్యులు తమకు నచ్చకపోతే అవకాశాలను ఎలా అడ్డుకుంటారో తెలిపారు. "నెంబర్ రాసుకున్నాను భయ్యా, తొందరగా ఫోన్ వస్తుంది" అని చెప్పి, ఆ అవకాశాన్ని వేరొకరికి ఎలా కట్టబెడతారో ఆయన ఉదాహరణలతో చెప్పారు. కో-డైరెక్టర్ లేదా టీమ్ సభ్యులకు తనను నచ్చకపోతే, లేదా వారికీ వేరొకరితో వంద రకాల లావాదేవీలు ఉంటే తన స్థానంలో వేరొకరిని తీసుకుంటారని ఆవేదన వ్యక్తం చేశారు.కొత్త డైరెక్టర్లతో పని చేసేటప్పుడు ఎదురయ్యే సమస్యలను చలాకీ చంటి ప్రస్తావించారు. తనకు ఏజ్ తక్కువ ఉన్నా, తన తర్వాత ఇండస్ట్రీలోకి వచ్చి హిట్ కొట్టి డైరెక్టర్లు అయినవారు కొంతమంది అన్న అని పిలుస్తారని, మరికొందరు "అన్న వద్దన్నా, పేరుతో పిలవండి" అని అంటారని చెప్పారు. అలా పేరుతో పిలిచినప్పుడు, పక్కన ఉన్న టీమ్ సభ్యులకు అది నచ్చక, తన పాత్రను తీసేసిన సంఘటనను వివరించారు. "ఒక దర్శకుడి తండ్రి పక్కన నుంచుని సిగరెట్ తాగినందుకు నా పాత్రను తీసేశారు. ఆయన డైరెక్టర్ తండ్రి అని నాకు తెలిస్తే నేను అక్కడ ఉండను కదా" అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు తనకే కాకుండా చాలా మంది ఆర్టిస్టులకు ఎదురవుతాయని ఆయన అన్నారు.

ప్రతి రోజూ బెండకాయ కూర ఉండాల్సిందే



అక్కినేని నాగార్జున ఎప్పుడూ యంగ్‌గా, ఫిట్‌గా కనిపించడానికి గల కారణాలను ఆయన వ్యక్తిగత మేకప్ మ్యాన్ చంద్ర ఇటీవల ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. నాగార్జున కేవలం తన రిచ్‌నెస్‌తో కాకుండా, తన క్రమశిక్షణతో కూడిన జీవనశైలి, ఆహారపు అలవాట్లు, శరీర నిర్వహణతో ఎంతోమందికి ఆదర్శంగా నిలిచారని చంద్ర తెలిపారు. నాగార్జున వారంలో ఐదు రోజులు సాధారణ ఆహారాన్ని మితంగా తీసుకుంటారు. ఉదాహరణకు, అల్పాహారంగా ఒక ఇడ్లీ లేదా ఒక వడ, ఒక గారె మాత్రమే తింటారు. ఆయనకు ఆకలి వేస్తేనే తింటారని, ఆకలి లేనిది ఎప్పుడూ ఆహారం తీసుకోరని చంద్ర స్పష్టం చేశారు. చాలామందిలాగా ఆకలి ఉన్నా లేకపోయినా ఎవరో పెడితే తినే అలవాటు ఆయనకు లేదని పేర్కొన్నారు. ప్రతిరోజూ బెండకాయ కూర ఉండాలి. హాట్ చిప్స్, రసం, ఒక అరటిపండు కూడా తప్పనిసరి. అన్నం విషయానికి వస్తే, ఆయన మన సాధారణ బియ్యంతో వండిన అన్నం తినరని అన్నారు. పాత రోజుల్లో ఉండే తవుడు తీయని దంపుడు బియ్యం అన్నాన్ని మాత్రమే తింటారు. ఈ అన్నం చాలా మెత్తగా, ముద్దలాగా ఉండాలని ఆయనకు ఇష్టమని చంద్ర వివరించారు. ఈ నాలుగు రకాలు కంపల్సరీగా ఉంటాయి, కానీ అన్నీ తక్కువ

Printed, published &owned. By ravula rajesham printed at. JORDAR publication H.NO.2-5_146 . jammikunta.dist. karimnagar Telangana state 505122..editor.ravula rajesham, email. editor jordar@gmail.com. cellphone 7780185674 PRGi numberTG TEL/25/A5224